
JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 30-03-2026
Medchal - Malkajgiri । Monday 30-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 302
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 302 । Pages : 8 । ₹: 5



7 లో

## ఇది వరస.. పసలేని సినిమాలు హీరోలకు డైరెక్టర్ల భజనలు




2 లో

## పోలీసులకు కేటీఆర్ వార్నింగ్



5 లో



# వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత

- వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు రక్షణ కల్పించే దిశగా ఈ చట్టం ఒక కీలక ముందడుగు
- పిల్లల్లో జవాబుదారితనం రావాలి
- ఏ తల్లి దండ్రులు అనాథలుగా మిగిలిపోవద్దు

**జయభేరి, హైదరాబాద్ :**

ఈ సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న సంకల్పంతోనే ప్రభుత్వం తల్లిదండ్రుల రక్షణ కోసం చట్టం తీసుకొస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. శాసనసభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టిన "తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026" పై ముఖ్యమంత్రి మాట్లాడారు. "వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత కల్పించాలని అందుకు అనుగుణంగా చట్టం చేయాలని ఎంతో బాధ్యతతో, భావోద్వేగంతో ఆలోచన చేసి దీన్ని తీసుకొచ్చాం. తల్లిదండ్రుల పట్ల భక్తి లేని వారికి భయం కలిగించేందుకే ఈ చట్టం తెచ్చాం. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు రక్షణ కల్పించే దిశగా ఈ చట్టం ఒక కీలక ముందడుగు. మనిషి బంధాలు, అనుబంధాలను మర్చిపోయి చివరికి పేగు బంధాలను కూడా విస్మరించి, భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాలు, సంపద కోసం పాకులాటల్లో మునిగిపోయే పరిస్థితులు వచ్చాయి. తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకోవడం ఈ సమాజానికి మంచిది కాద"ని అన్నారు. "దేశంలో పిల్లల సామాజిక భద్రత,

...మిగతాది 2 లో

# వదంతులకు దూరంగా ఉండండి

- ఏ కష్టమొచ్చిన కలిసికట్టుగా ఎదురుకుందాం.. ప్రధాని మోదీ!
- 'మన్ కీ బాత్' ద్వారా, ఈ సవాలును అధిగమించడానికి పౌరులందరూ ఏకం కావాలని ఆయన మరోసారి పిలుపునిచ్చారు
- ఈసారి కూడా మనమందరం కలిసి ఈ క్లిష్ట పరిస్థితి నుండి విజయం సాధిస్తామని ప్రధాని మోదీ ధీమా
- పౌరులు చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవాలని, వంట నూనె వాడకాన్ని 10 శాతం మేర తగ్గించుకోవాలని ప్రధానమంత్రి కోరారు



2 లో

**జయభేరి, న్యూఢిల్లీ:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం (మార్చి 29, 2026) ఉదయం 11 గంటలకు ఆల్ ఇండియా రేడియో 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'మన్ కీ బాత్' కార్యక్రమం 132వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, "ఈ మార్చి నెల ప్రపంచవ్యాప్తంగా చాలా అల్లకల్లోలంగా గడిచింది. కోవిడ్ కారణంగా యావత్ ప్రపంచం చాలా కాలం పాటు అనేక సమస్యలను ఎదుర్కొన్న విషయం మనందరికీ గుర్తుంది.

# భూ ఆక్రమణలపై కేటీఆర్‌పై దానం ఆరోపణలు

- నా సొంత భూమిని కేటీఆర్ వదల్లేదు, ఎవరికీ చెప్పుకోలేకపోయాం.. దానం నాగేందర్ ఆరోపణలు
- అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మైనింగ్, ఇసుక అక్రమ రవాణాపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం



2 లో

**జయభేరి, హైదరాబాద్ :**

అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్‌ను ఉద్దేశించి దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వేల ఎకరాల భూమి కబ్జాలకు గురైందని ఆరోపించారు. ఇక తన సొంత భూమిని కూడా కేటీఆర్ ఆక్రమించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ భూమిని కేటీఆర్ ప్రైవేటు కంపెనీలకు అప్పగించారని.. అయినప్పటికీ తాను ఏమీ చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

# కృష్ణమ్మ అలలపై అద్భుత దృశ్యం

- వినూత్నంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- బోట్లపై ఉన్న నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు కలిసి ఉత్సాహంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు
- నదిపై ఇలా రాజకీయ ర్యాలీ నిర్వహించడం అరుదైన విషయం



**జయభేరి, విజయవాడ, మార్చి 29 :**

టీడీపీ పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కృష్ణా నదిలో కన్నుల పండుగగా జరిగాయి. బోటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉండవల్లి పాత ఇసుక రేవు నుంచి ప్రారంభమైన ఈ బోటు ర్యాలీ కృష్ణా నదిలో ఒక అరుదైన దృశ్యాన్ని సృష్టించింది. మొత్తం 10 భారీ ఇసుక బోట్లు, 20 మర బోట్లతో ప్రాకశం బ్యారేజ్ వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ సమయంలో బోట్‌లపై ఎగిరే టీడీపీ జెండాల దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. బోట్లపై ఉన్న నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు కలిసి

...మిగతాది 2 లో



# విద్యార్థినికి లెక్చరర్ల వేధింపులు

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- తన కుమార్తెను ఇబ్బందులకు గురిచేసిన లెక్చరర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**జయభేరి, ఉప్పల్ :**

మేడ్చల్ జిల్లా ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో దారుణం చోటు చేసుకుంది. తనపై లెక్చరర్లు వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో తల్లితో కలిసి విద్యార్థిని తిరునాయన ఫిర్యాదు చేశారు. కాప్రాకు చెందిన తిరునాయన ప్రస్తుతం బీఎస్సీ డేటా సైన్స్ మూడవ సంవత్సరం చదువుతోంది.

...మిగతాది 2 లో




# అసెంబ్లీని కుదిపేసిన కౌశిక్‌రెడ్డి వివాదం

- సభ నుంచి BRS ఎమ్మెల్యేలు సస్పెండ్!

**జయభేరి, హైదరాబాద్ :**

ఆదివారం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గా సాగాయి. సభలో పాలకవర్గం, వర్సెస్ ప్రతిపక్షం అన్నట్టు సభగా సాగింది. సభలో BRS ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహారశైలిపై దుమారం చెలరేగింది. కడియం మాట్లాడుతుండగా కౌశిక్ రెడ్డి బెదిరించారని ఆరోపణలు చేసింది అధికార పక్షం.



2 లో

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పుష్కరఘాట్ల అభివృద్ధి

5 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత

మహిళల భద్రత, హక్కులకు రాజ్యాంగ రక్షణతో పాటు, అనేక చట్టాలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (ఏ) ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత విద్య హక్కు ఉంది. ఆర్టికల్ 24 ప్రకారం ప్రమాదకర పనుల్లో బాల కార్మికుల నిషేధం ఉంది. అనాథలు, నిరాశ్రయ పిల్లలు, నేరాల్లో చిక్కుకున్న పిల్లల సంరక్షణ కోసం జువెనైల్ జస్టిస్ యాక్ట్ (2015) ఉంది. పిల్లలపై లైంగిక దాడులు, వేధింపుల నుంచి రక్షణ కోసం పోక్సో చట్టం (2012) ఉంది. విద్యా హక్కు చట్టం (2009) ఉంది. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని బాల కార్మిక చట్టం ఉంది. బాల్య వివాహాల నిషేధం చట్టం ఉంది. పిల్లల హక్కులు, రక్షణ విషయంలో అనేక అంతర్జాతీయ ఒప్పందాలు కూడా ఉన్నాయి.

మహిళల విషయానికి వస్తే, గృహ హింస నుంచి వాళ్లకు భద్రత కల్పించడం కోసం చట్టం ఉంది. లైంగిక నేరాలకు సంబంధించి నిర్భయ లాంటి చట్టాలున్నాయి. వరకట్న నిషేధ చట్టం ఉంది. మహిళల గౌరవం - హక్కుల పరిరక్షణకు చట్టం ఉంది. ఇక వృద్ధుల సామాజిక భద్రతకు సంబంధించి మన దేశంలో చట్టాలు ఉన్నాయి. పిల్లలు తమ తల్లి దండ్రులను చూసుకోవడం చట్టబద్ధ బాధ్యతగా చేస్తూ "maintenance and welfare of parents and senior citizens act 2007" ఉంది. ఇలా చాలా చట్టాలు ఉన్నప్పటికీ సమాజంలో తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో జరుగుతున్న వివక్ష, నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సంఘటనలు అందరం చూస్తున్నాం. బతికున్నప్పుడు గుప్పెడు మెతుకులు పెట్టని బిడ్డలు, చనిపోయాక ఆస్తుల కోసం కొట్లాడుకుంటున్న సందర్భం అత్యంత దురదృష్టకరమని" అన్నారు. పురాణాలలో మాతృ పితృ భక్తికి మారుపేరుగా నిలిచిన శ్రవణ కుమారుడి కథను సభలో వివరించారు. తల్లిదండ్రులను ప్రేమించడంలో అందరూ శ్రవణ కుమారుడిని ఆదర్శంగా తీసుకుంటే వారి బాగోగుల గురించి ఎలాంటి చట్టాలు, నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రఖ్యాత దుస్తుల వ్యాపారి రేమండ్స్ మాజీ అధినేత, పద్మభూషణ్ అవార్డు గ్రహీత విజయ్ పథ్ సింఘానియా దృష్టాంతాన్ని కూడా సభలో ప్రస్తావించారు. వేలకోట్లు ఆర్జించిన గొప్ప వ్యాపారవేత్త విజయ్ పథ్ సింఘానియా ఆస్తి సర్వస్వాన్ని కుమారుడికి గిఫ్ట్ డీడ్ రూపంలో అప్పగించిన తర్వాత ఆయన జీవితం ఏ విధంగా విషాదకరంగా మారిన సంఘటనను వివరించారు.

ఆస్తి దక్కగానే కుమారుడు తండ్రి సొంత ఇంటిని కూడా దక్కనీయకుండా బయటకు పంపడంతో అద్దె ఇంట్లో నివసించాల్సిన దయనీయ పరిస్థితులను వివరిస్తూ, జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను విజయ్ పథ్ సింఘానియా రాసుకున్న ఆత్మకథ 'An Incomplete Life' లో "పిల్లలకు సర్వస్వం ఇచ్చేసి నేను పెద్ద తప్పు చేశాను, ఏ తండ్రీ నాకంటే దారుణమైన స్థితిని అనుభవించకూడదు" అని ఆ పుస్తకంలో వ్యక్తం చేసిన ఆవేదన సమాజంలోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు తెలియజేశారు. "ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. లేదా ఎక్కువ మంది సంతానం ఉండేది. దాని వల్ల ఒకరు కాకపోయినా ఇంకొకరైనా తల్లిదండ్రుల సంరక్షణ చూసేవాళ్లు. కుటుంబ నియంత్రణతో ఒక్కరిద్దరికే పరిమితమయ్యారు. నాకు తెలిసిన ఒక ప్రజా ప్రతినిధి తండ్రికి క్యాన్సర్ సోకితే చికిత్స ఇప్పించకుండా నిర్లక్ష్యం వహించారు.

ఇటీవలే వారు మరణించారు. తల్లిదండ్రులను చూసుకోలేని వారిని సమాజం బహిష్కరించాలి. ఒక సామాజిక బాధ్యతగా ఈ బిల్లును తీసుకువస్తున్నాం. పిల్లల్లో జవాబుదారితనం రావాలి. ఈ చట్టంతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని కాదు. ఈ చట్టంతో వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించేందుకే మా ప్రయత్నం. ఏ తల్లి దండ్రులు అనాథలుగా మిగిలిపోవద్దు. చివరి రోజుల్లో వాళ్ల బాగోగుల కోసం ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఈ బిల్లును తెచ్చాం. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులే కాదు. ప్రజాప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలో చేర్చాం. ఈ చట్టం చేయడం ద్వారా కొంతైనా వృద్ధ తల్లిదండ్రుల్లో విశ్వాసం కల్పించిన వారంగా మారుతాం. సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని, ఒక సామాజిక బాధ్యతతో తెసుకొచ్చిన ఈ బిల్లుకు అన్ని పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు విజ్ఞప్తి చేశారు.

## కృష్ణమ్మ అలలపై అద్భుత దృశ్యం

ఉత్సాహంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. జై తెలుగుదేశం అంటూ గట్టిగా వినిపించిన స్వరాలు కృష్ణా అలలపై ప్రతిధ్వనించాయి. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ ర్యాలీ నదిపై ఒక ప్రత్యేక వాతావరణాన్ని సృష్టించింది. ఉండవల్లి కరకట్టపై ఈ దృశ్యాన్ని చూసేందుకు ప్రజలు తారసపడ్డారు. వాహనదారులు తమ వాహనాలను నెమ్మదిగా నడిపిస్తూ ర్యాలీని వీక్షించగా, పాదచారులు చేతులు ఊపుతూ మద్దతు తెలిపారు. కొందరు మొబైల్ ఫోన్లలో ఈ అరుదైన క్షణాలను బంధించారు. దీంతో కరకట్ట ప్రాంతం మొత్తం ఒక ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది.. బోటింగ్ సొసైటీ సభ్యులు, స్థానిక మత్స్యకారులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నదిపై ఇలా రాజకీయ ర్యాలీ నిర్వహించడం అరుదైన విషయం. ఈ వినూత్న ప్రయత్నం ద్వారా టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి కొత్త శోభ తీసుకొచ్చారు. కృష్ణా అలలపై సాగిన ఈ బోటు ర్యాలీ, తాడేపల్లి ప్రాంతంలో చిరస్మరణీయ ఘటనగా నిలిచిపోనుంది.

## అసెంబ్లీని కుదిపేసిన కౌశిక్‌రెడ్డి వివాదం

గన్‌తో కాల్చి పడేస్తానని కౌశిక్ చేయితో సైగలు చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. దీంతోకౌశిక్ రెడ్డిపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కౌశిక్ రెడ్డిని మిగిలిన పదవీకాలం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి వీడియో పరిశీలించి స్పీకర్ చర్యలు తీసుకోవాలని విప్ ఆది శ్రీనివాస్ ప్రతిపాదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వివాదం తెలంగాణ అసెంబ్లీని కుదిపేంది. ఎమ్మెల్యే కడియంను ఉద్దేశించి గన్‌తో కాల్చి పడేస్తానని కౌశిక్ రెడ్డి చేత్తో సైగలు చేశారని అధికార పక్షం ఆరోపిచింది. ఈ క్రమంలోనే కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్యేగా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది. కౌశిక్ రెడ్డి వీడియో పరిశీలించి స్పీకర్ చర్యలు తీసుకోవాలని విప్ ఆది శ్రీనివాస్ ప్రతిపాదించారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఎథిక్స్ కమిటీకి ఈ అంశాన్ని నివేదించారు.

ఇదే ఘటనపై అటు సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. సభలో ఇలాంటి ఘటనలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కౌశిక్ వ్యవహారశైలిని సమర్థిస్తే అసెంబ్లీలో కత్తిపోట్లు జరుగుతాయి అభిప్రాయపడ్డారు. కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనను సూమోటోగా విచారణకు స్వీకరించాలని అన్నారు. అయితే దీనిపై స్పందించిన స్పీకర్ సభలో ఆందోళన చేసిన బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ చేస్తున్నట్టు తెలిపారు. ఈరోజు, రేపు BRS సభ్యుల సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## విద్యార్థినికి లెక్చరర్ల వేధింపులు

అనారోగ్య సమస్యల కారణంగా తరచూ కళాశాలకు హాజరు కాలేకపోయిన ఆమె, డాక్టర్ సర్టిఫికెట్ సమర్పించి అటెండెన్స్ ఫీజు చెల్లిస్తూ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపింది. మొదటి సంవత్సరం నుంచే కళాశాల లెక్చరర్లు తనపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. రెండవ సంవత్సరం సమయంలో తన వ్యక్తిత్వంపై తప్పుగా ప్రచారం చేయడం, ఫోన్‌లోని ఫోటోలను షేర్ చేస్తూ వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొంది. ఈ వేధింపులపై గతంలో ఫిర్యాదు చేసినా, ఇప్పుడు మళ్లీ వేధిస్తున్నట్లు వెల్లడించింది. ఇటీవల మరోసారి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సమయంలో లెక్చరర్లు మానసిక ఒత్తిడికి గురిచేశారని వెల్లడించింది. కాలేజీకి రాకుండా ఎవరితో తిరుగుతున్నావని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు చేసింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించింది. అటు బాధితురాలి తల్లి మాట్లాడుతూ, తన కుమార్తెను ఇబ్బందులకు గురిచేసిన కళాశాల లెక్చరర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇది వరస.. పసలేని సినిమాలు
# హీరోలకు డైరెక్టర్ల భజనలు

**సినిమా వ్యాపారంగా మారిపోయిన నేటి సమాజంలో ఇంకేం దొరుకుతుంది కథలు దొరకడం లేద!? ప్రేక్షకులు అంటే అంత అలుస..**
**భారీ బడ్జెట్ తో సినిమా తీశాను... బాగుంటుంది అని ఓపెనింగ్లలో గొప్పలు చెప్పడు తప్ప మరి ఏమీ లేదా... సగటు ప్రేక్షకుడు సినిమా చూద్దామని వెళ్తే ఈ మధ్యకాలంలో అసలు సినిమాలు అంతగా నచ్చడం లేదని పెదవి విరుస్తున్నారు.. ఎందుకంటే వాస్తవానికి సినిమాలు కూడా ఇప్పుడు వచ్చే నూతన డైరెక్టర్లు పూర్తిగా హీరోల ఇమేజ్ ని పట్టుకొని సాగదీసే కథలతో సోది తెప్పించే డైలాగులతో సినిమాను తూతూ మంత్రంగానే కానిస్తున్నారు తప్ప ఏ ఒక్క దర్శకుడు కథను బట్టి హీరోను నిర్ణయించుకోవడం ఏనాడు బందు చేసినట్టు అనిపిస్తోంది.**



జయభేరి, హైదరాబాద్ :

తెలుగు సినిమా మరి దారుణంగా కథల ఎంచుకోవడంలో పూర్తిగా పడిపోయింది అని చెప్పాలి.. ఈ మధ్యకాలంలో వచ్చిన పెద్ద హీరోల సినిమాలు పూర్తిగా హీరోల చుట్టూ తిరుగుతూ ఉండే కథలు మాత్రం గానే కనిపించాయి.. అంతేకానీ కథలు పట్టు లేనట్టుగా కనిపిస్తోంది. కొంతమంది డైరెక్టర్లు మక్కికి మక్కి స్టోరీలు అల్లుకున్న మరి కొంతమంది డైరెక్టర్లు హీరోలను భజన చేస్తూ వారికే వత్తాసు పలుకుతూ కథలు తయారు చేసుకుంటూ కాలాన్ని వెళ్లబుచ్చుతుంటున్నారు. కాసులు బాగానే దండుకుంటున్నారు. ఏదేమైనా ప్రేక్షకులకు ఏది కావాలో అది వదిలేసి పూర్తిగా ఒక డైరెక్టర్ ఆ హీరోకు ఈ కథ అయితే బాగుంటుంది అని హీరో చుట్టూ తిరిగే కథనే అల్లుకొని పాత సినిమాలోని కొన్ని పాటలను మళ్లీ వల్లిస్తూ అవే డైలాగులను పదేపదే చెబుతూ సోది తెప్పించే డైలాగులతో ఆ పెద్ద హీరోలు తమ రాజకీయం కోసం లేదంటే తన ఇమేజ్ను కాపాడుకోవడం కోసమో ఏమో తెలియదు కానీ మొత్తానికి పసలేని కథలు సోది తెప్పించే డైలాగులు వెరసి రెండున్నర గంటలు సమయం డబ్బు వృథా అనిపించేలా ఇప్పుడు వచ్చే సినిమాల వరస ఉంది.

ఆ హీరోతో మేము ఇంత కష్టపడి చాలా గొప్ప సినిమా తీశాం అని చెప్పుకునే డైరెక్టర్లు వాళ్ల బుద్ధి కథ ఎంచుకునే విధానం పూర్తిగా హీరోల చుట్టూ తిరుగుతూనే ఉంది. గతంలో వచ్చిన సినిమాలు చూసుకుంటే హీరోనే కథ అనే మాదిరిగా ఉండేవి. కానీ ఇప్పుడు వస్తున్న సినిమాలు ఈరోజు చుట్టూ కథ తిరుగుతుంది. ఇక హీరోయిన్ల అర్ధనగ్న ప్రదర్శనలు చెప్పనక్కరలేదు. నాలుగు ఫైట్లు ఆరు పాటలు బోరు కొట్టించే డైలాగులు అంతే సినిమా పూర్తి అయిపోయింది. ఇక సినిమా పేర్లు నాటి పాత సినిమా పాటల లోని ఒక లైన్ తీసుకొని అందులో సినిమా పేరును వెతుక్కునే దారిద్రం దాపరించింది. సినిమా అంటే సగటు ప్రేక్షకుడు ఏం కోరుకుంటాడు అది మరిచిపోయిన ఈనాటి డైరెక్టర్లు వాళ్ళు ఏం తీస్తారు అదే చూడాలి అన్నట్టుగా చేస్తున్నారు. ఇంకొక అడుగు ముందుకేసి ఆ హీరోనే పాట పాడితే సినిమా ప్రమోషన్ కూడా బాగా ఉంటుంది అంటూ హీరోలతో కూడా పాటలు పాడిస్తున్నారు. హీరోల అభిమానులు రోజురోజుకు పెరిగిపోతూ అనవసరమైన ఖర్చులు ఈవెంట్లు చేసేస్తూ డబ్బులను వృధా చేసుకుంటున్నారు. అభిమానానికి అర్థంపర్థం లేకుండా పోతుంది. ఈ మధ్యకాలంలో వచ్చిన సినిమాలు ఒక్కసారి మీరు నెమరు వేసుకోండి.. ఆ కథకు పెట్టే పేరే వెరైటీగా ఉంటుంది అందులో ఆ హీరో కనిపించిన దగ్గర నుంచి ఎండింగ్ వరకు పూర్తిగా అర్థంపర్థం లేని కామెడీలతో సినిమాను నడిపించే డైరెక్టర్లు ఆ హీరోలకు భజన చేస్తూ అసలు ఆ హీరోతో కలిసి పనిచేయడమే తాను చేసుకున్న మహా పుణ్యం ల భావిస్తూ అదంతా ప్రేక్షకుల నెత్తికి రుద్దుతారు.. తెలుగు సినిమా వరుస ఇలా ఉంటే ఇక కన్నడ మలయాళీ సినిమాలు పూర్తిగా దినంగా ఉంటాయి. వాళ్ల డైరెక్టర్ల ఆలోచన శక్తి అమోఘంగా ఉంటుంది.



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

కథను బలంగా అల్లుకొని ఆ తర్వాత హీరోను వెతుక్కుంటారు. కథకు తగ్గట్టుగానే పాత్రలు పాత్రధారులు డైలాగులు పాటలు అన్నీ వాస్తవ కోణాన్ని అద్దం పట్టేలా కనిపిస్తాయి. కానీ తెలుగు సినిమా పుణ్యమా అని పూర్తిగా ఆ సందర్భంగా వచ్చే పాటలు ఆ సందర్భంగా చెప్పే డైలాగులు ఆ డైలాగులకు ప్రేక్షకుల పెడబొబ్బలు, అరుపులు గెంతులు అంతకుమించితే కొట్లాటలు.. అసలు సినిమా వ్యవస్థ దేనికోసం అన్న ఆలోచన మర్చిపోయారు. సమాజానికి అతివృష్టి అనావృష్టి వచ్చినప్పుడు సినిమా హీరోలుగా చేసి బాగా డబ్బు గడించిన వాళ్లు మానవత్వంతో కొంతమంది సమాజానికి సేవ చేస్తుంటే మరి కొంతమంది పెల్లికి కూడా బిచ్చం వేయని మనస్తత్వంతో ఉండటం మనం గమనించి ఉంటాం. హీరోల పిల్లలు వాళ్ళ మన వాళ్లు మళ్లీ వాళ్ళు హీరోలు ఇది వరుస... ప్రేక్షకుడు ఏం పాపం చేశాడు పొద్దునుంచి కష్టపడి నాలుగు రాళ్లు సంపాదించుకొని తన ఆనందం కోసం వెళ్లి సినిమా చూసే రోజులు ఇప్పుడు మారిపోయాయా... ఏమో నిజంగా అలాంటి రోజులు మళ్లీ వస్తాయా అనుకుంటే సమాధానం దొరకని ప్రశ్న. సినిమాకు ఒక మంచి కథ కావాలి సమాజంలో ఉన్న రుగ్మతలను సమాజంలో ఉన్న మూర్ఖత్వాన్ని సమాజంలో ఉన్న సోషల్ ఎలివేన్స్ ని బయటికి తీసుకురావడానికి ఏ ఒక్క డైరెక్టర్ ప్రయత్నం చేయడు. సామాజిక బాధ్యతతో సినిమాలు తీసే డైరెక్టర్లే లేరు. ఆ హీరోకు సంబంధించి కమర్షియల్ గా ఏ హీరోయిన్ ని పెట్టాలి ఎంత డబ్బు ఖర్చు పెడితే ఎంత డబ్బును రాబట్టుకోవచ్చు రికార్డ్ బద్దలు కొట్టొచ్చు అని ఆలోచిస్తారే కానీ సగటు ప్రేక్షకునికి ఏం కావాలి అన్న కోణంలో ఏ ఒక్క డైరెక్టర్ ఆలోచించడం లేదు.. ఇక పాటల సాహిత్యానికి వస్తే కథ వేరుగానే ఉంటుంది. ఇదే సినిమా ఇండస్ట్రీలో క్యాస్ట్ ఇజం అనేది ఇంకా పోనట్టుగానే కనిపిస్తుంది.. టాలెంట్ ఉంటే ఎవరైనా ఎక్కడికైనా వెళ్లొచ్చు గమ్యాన్ని చేరొచ్చు అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు కానీ అంత టాలెంట్ ఉన్నా కులం అడ్డొచ్చి పూర్తిగా సైడ్ క్యారెక్టర్లకే నెట్టివేసిన వాళ్ళు కూడా ఎంతోమంది సినిమా ఇండస్ట్రీలో ఇంకా మగ్గుతూనే ఉన్నారు...

నాటి సినిమాల గురించి మాట్లాడుకుంటే అస్సలు కాలం తెలియదు. నేటి సినిమాల గురించి మాట్లాడుకుంటే అస్సలు వదవదు.. ఇది వరస సినిమాలు బాగుంటేనే సినిమా కార్మికులు జీవన పరిస్థితి మెరుగుపడుతుంది అలాంటిది కార్మికులు కార్మికులుగానే మిగిలిపోతున్నారు సినిమా హీరోలు ప్రొడ్యూసర్లు డబ్బులు కోట్ల రూపాయలు గడించి కోట్లలోనే సినిమాలు ప్రొడ్యూస్ చేస్తున్నారు.. ఒక్కొక్కసారి ఒక సినిమా ప్రొడ్యూస్ ఈ రాష్ట్ర బడ్జెట్ కూడా ఉండదేమో అనిపిస్తుంది. సినిమాల ప్రభావం సమాజం మీద గట్టిగా పడుతుంది కాబట్టి ఇప్పటికైనా డైరెక్టర్లు మంచి కథలను ఎంచుకొని హీరోల గొప్పలు చెప్పడం మానేసి కథకు తలవంచేలా హీరోలను ఎంచుకోవడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే సినిమా బతుకుతుంది పది కాలాలపాటు నడుస్తుంది. ఇదంతా సోది ఎందుకులే అనుకుంటే కేవలం వ్యాపారంగానే చూస్తే సినిమా వ్యాపారంగా మారిపోయిన నేటి రోజుల్లో ఇంకా సినిమా గురించి నీతులు చెప్పడం ఎందుకని ఒక రకమైన ప్రజలు ఆలోచించుకోవచ్చు. అది వారి ఇష్టం. కానీ సినిమా అనేది ఒక కళామతల్లిగా భావించి మంచి కథలకు ఎప్పుడు ప్రాధాన్యం ఉంటుంది అని భావించి రాబోయే నూతన దర్శకులు తమ టాలెంట్ కి పదును పెట్టి సినిమాలు తీస్తే బాగుంటుందని చాలామంది అభిప్రాయం పడుతున్నారు. షార్ట్ ఫిలిం తీస్తూ వచ్చిన డైరెక్టర్ పెద్ద హీరో దగ్గరికి వచ్చేసరికి పూర్తిగా తన దర్శకత్వపు రూపురేఖలను మార్చేసుకొని ఆ హీరోకు భజనలు చేసే విధంగా మారిపోవడం నేటి సినిమాకు ఉన్న ప్రత్యేకత. ప్రజలు అభిమానిస్తే సెలబ్రిటీలుగా మారిపోయిన వాళ్లు కోట్ల రూపాయలు గడించి వాళ్లు బాగానే ఉన్నా సినిమాకు పనిచేస్తున్న సినీ కార్మికులు సినిమా చూస్తున్న ప్రేక్షకులు వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రాకపోవడం కోస మెరుపు...

## వదంతులకు దూరంగా ఉండండి

కరోనా సంక్షోభాన్ని అధిగమించిన తర్వాత ప్రపంచం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని అందరూ ఆశించారు. అయితే, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో యుద్ధ, ఘర్షణ పరిస్థితులు తలెత్తుతూనే ఉన్నాయి. ఇప్పుడు మనం ఈ సంక్షోభం నుండి మరోసారి ఐక్యంగా బయటపడాల్సి ఉంది" అని ప్రధానమంత్రి అన్నారు. ప్రస్తుతం యుద్ధంలో ఉన్న ప్రాంతం మన ఇంధన అవసరాలకు ఒక ప్రధాన కేంద్రమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది పెట్రోల్, డీజిల్ విషయంలో ప్రపంచ సంక్షోభానికి దారితీస్తోందన్నారు. మన దౌత్య సంబంధాలు, వివిధ దేశాల నుండి మనకు లభించే మద్దతు, గత దశాబ్ద కాలంలో మనం నిర్మించుకున్న బలాలు ఈ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు భారతదేశానికి దోహదపడ్డాయని తెలిపారు. ప్రస్తుతం నిస్సందేహంగా సవాలుతో కూడిన సమయాలని ఆయన పేర్కొన్నారు. 'మన్ కీ బాత్' ద్వారా, ఈ సవాలును అధిగమించడానికి పౌరులందరూ ఏకం కావాలని ఆయన మరోసారి పిలుపునిచ్చారు. ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్న వారు మానుకోవాలని ఆయన సూచించారు. ఇది 140 కోట్ల మంది పౌరుల ప్రయోజనాలకు సంబంధించిన విషయమని, ఇందులో స్వార్థ రాజకీయాలకు తావులేదని ఆయన ఉద్ఘాటించారు. అందువల్ల, పుకార్లు వ్యాపింపజేస్తున్న వారు దేశానికి పెద్ద హాని కలిగిస్తున్నారు. ఈ సమయంలో దేశ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వదంతులకు మోసపోవద్దని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సమాచారాన్ని విశ్వసించి, దాని ఆధారంగా చర్యలు తీసుకోవాలన్నారు. 140 కోట్ల మంది పౌరుల బలంతో గత సంక్షోభాలను ఎలాగైతే అధిగమించామో, అలాగే ఈసారి కూడా మనమందరం కలిసి ఈ క్లిష్ట పరిస్థితి నుండి విజయం సాధిస్తామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. మార్చి నెల దేశవ్యాప్తంగా క్రీడాభిమానులకు ఉత్సాహం, ఆనందంతో నిండిపోయిందని ప్రధాని మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో అన్నారు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ చారిత్రాత్మక విజయం సాధించినప్పుడు, దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. భారత జట్టు సాధించిన ఈ అద్భుతమైన విజయానికి మనమందరం చాలా గర్వపడుతున్నాము. గత నెల చివరిలో కర్ణాటకలోని హుబ్లీలో ఒక అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ గెలిచి జమ్మూ కాశ్మీర్ క్రికెట్ జట్టు రంజీ ట్రోఫీని కైవసం చేసుకుంది. దాదాపు ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జట్టు తన తొలి రంజీ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకోవడం హర్షదాయకం. కఠోర శ్రమ ఫలిస్తుందని ఇది నిరూపిస్తుందన్నారు ప్రధాని. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రతిభావంతుడైన అథ్లెట్ గుల్వీర్ సింగ్, కొన్ని వారాల క్రితం న్యూయార్క్ సిటీ హాఫ్ మారథాన్‌లో మూడో స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గంటలోపు హాఫ్ మారథాన్‌ను పూర్తి చేసిన తొలి భారతీయ అథ్లెట్‌గా అతను నిలిచాడని గుర్తు చేశారు.


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మత్స్యకారుల గురించి ప్రస్తావించారు. కష్టపడి పనిచేసే మత్స్యకారుల జీవితాలను అనేక విధాలుగా సులభతరం చేస్తున్నామని ఆయన అన్నారు. ఓడరేవుల అభివృద్ధి, మత్స్యకారులకు బీమా వంటి అనేక కార్యక్రమాలు వారికి ఎంతగానో సహాయపడుతున్నాయని తెలిపారు. నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి ప్రతి గ్రామంలోనూ సామూహిక స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని చెప్పారు. పాత చెరువులను శుభ్రం చేయడంతో పాటు, వర్షపు నీటిని సంరక్షించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమృత్ సరోవర్ అభియాన్ కింద దేశవ్యాప్తంగా దాదాపు 70,000 అమృత్ సరోవర్లను నిర్మించారని ప్రధాని మోదీ తెలిపారు. ఫిట్‌నెస్, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ దేశపౌరులను కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 100 రోజుల కన్నా తక్కువ సమయం ఉందని, యోగా పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి క్రమంగా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఆఫ్రికాలోని జిబూటీలో అల్మిస్ జీ తన అరవింద్ యోగా కేంద్రం ద్వారా యోగాను ప్రోత్సహిస్తున్నారని కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. అనేక ఇతర ప్రదేశాలలో యోగా బోధిస్తూ, ఆరోగ్య అవగాహనను కూడా కల్పిస్తున్నారు. పౌరులు చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవాలని, వంట నూనె వాడకాన్ని 10 శాతం మేర తగ్గించుకోవాలని ప్రధానమంత్రి కోరారు. మన ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ఈ చిన్న చర్యలు చాలా కీలకమని ఆయన అన్నారు. దేశ యువత శక్తిని దేశ నిర్మాణానికి మళ్లించినప్పుడు, అది దేశానికి అపారమైన మద్దతును అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయంలో, 'మై భారత్' సంస్థ యువతరాన్ని సానుకూల కార్యకలాపాలలో నిమగ్నం చేయడం ద్వారా దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషిస్తోందన్నారు. 'మై భారత్' నిర్వహించిన 'బడ్జెట్ క్వెస్ట్'ను ఉదాహరణగా చూపుతూ, బడ్జెట్ ప్రక్రియ, విధాన రూపకల్పనతో యువతను అనుసంధానించడమే దీని లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు. ఈ క్విజ్‌లో దేశవ్యాప్తంగా సుమారు 12 లక్షల మంది యువత పాల్గొన్నారు. దీని తర్వాత, వ్యాస పోటీకి సుమారు 1,60,000 మందిని ఎంపిక చేశారు. ఈ వ్యాసాలలో కొన్నింటిని చదివిన తన అనుభవాన్ని కూడా ప్రధాని మోదీ పంచుకున్నారు. "జ్ఞాన్ భారతం సర్వే మన గొప్ప సంస్కృతి, సుసంపన్నమైన వారసత్వానికి సంబంధించినది. దేశవ్యాప్తంగా ఉన్న తాళపత్ర గ్రంథాల గురించి సమాచారాన్ని సేకరించడమే దీని ఉద్దేశ్యం. ఈ సర్వేలో చేరడానికి జ్ఞాన్ భారతం యాప్ ఒక మార్గం. మీ వద్ద ఏవైనా తాళపత్ర గ్రంథాలు లేదా వాటికి సంబంధించిన సమాచారం ఉంటే, దయచేసి వాటి ఫోటోను జ్ఞాన్ భారతం యాప్‌లో పంచుకోండి. ప్రతి వివరాలను నమోదు చేసే ముందు, దానికి సంబంధించిన సమాచారాన్ని కూడా ధృవీకరిస్తున్నాము. ఇప్పటివరకు ప్రజలు వేలాది తాళపత్ర గ్రంథాలను పంచుకోవడం నాకు సంతోషంగా ఉంది." అని ప్రధాని మోదీ అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని నమ్సాయికి చెందిన చావో నంతిసింగ్ లోకాంగ్ తాయ్ లిపిలోని వ్రాతప్రతులను పంచుకున్నారు. అమృత్‌సర్‌కు చెందిన అమిత్ సింగ్ రాణా, మన గొప్ప సిక్కు సంప్రదాయం, పంజాబీ భాషతో సన్నిహిత సంబంధం ఉన్న గురుముఖి లిపిలోని వ్రాతప్రతులను పంచుకున్నారు. కొన్ని సంస్థలు తాళపత్ర గ్రంథాలను విరాళంగా ఇచ్చాయి. రాజస్థాన్‌లోని అభయ్ జైన్ గ్రంథాలయం చాలా పురాతనమైన రాగి ఫలకాల వ్రాతప్రతులను పంచుకుంది. అదే సమయంలో, లడఖ్‌లోని హెమీస్ మఠం విలువైన టిబెటన్ వ్రాతప్రతుల గురించి సమాచారాన్ని అందించింది. నేను కేవలం కొన్ని ఉదాహరణలను మాత్రమే అందించాను. ఈ సర్వే జూన్ మధ్య వరకు కొనసాగుతుంది. మీరందరూ మీ సంస్కృతిలోని అంశాలను వెలికితీసి, పంచుకోవాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు.

## భూ ఆక్రమణలపై కేటీఆర్‌పై దానం ఆరోపణలు


తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. అదే సమయంలో తన సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యే దానం నాగేందర్ .. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాజకీయాల్లో మైనింగ్ మంటలు రాజేశాయి. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మైనింగ్, ఇసుక అక్రమ రవాణాపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఈ క్రమంలోనే ఆదివారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌పై.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో వేల ఎకరాల భూ కుంభకోణం జరిగినట్లు దానం నాగేందర్ ఆరోపణలు గుప్పించారు. అంతేకాకుండా కేటీఆర్.. తమ సొంత భూమిని కూడా కేటీఆర్ వదలకుండా కబ్జా చేశారని ఆరోపించారు. కేటీఆర్ చేసిన పనికి తమ బాధలను ఎవరికీ చెప్పుకోలేక గతంలో తాము నోరు మూసుకుని కూర్చున్నామని సంచలన ఆరోపణలు చేశారు. తన తండ్రి కష్టపడి సంపాదించిన తమ సొంత భూమిని కూడా కేటీఆర్ ఒక ప్రైవేట్ కంపెనీకి అప్పగించినట్లు దానం నాగేందర్ పేర్కొన్నారు. తాము హైదరాబాద్‌లో పుట్టి పెరిగామని.. అయినప్పటికీ తాము మౌనంగా ఉండిపోవాల్సిన దయనీయమైన పరిస్థితి ఏర్పడిందని దానం నాగేందర్ వెల్లడించారు. ఈ విషయంలో తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని.. కావాలంటే రికార్డులు కూడా చూపిస్తానని చెప్పారు. తాము ఎంత నష్టపోయాము అనేది తమకు మాత్రమే తెలుసని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేకపోయామని దానం నాగేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూకుంభకోణాలపై హౌస్ కమిటీ వేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

జయభేరి, దేవరకొండ :



పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దేవరకొండ పట్టణానికి చెందిన 50 మంది బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పదేండ్ల పాటు అభివృద్ధి మార్గంలో పరుగులు తీసిన తెలంగాణ అని ఆయన గుర్తు చేశారు.నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వల్ల సంక్షోభంలో కూరుకుపోయింది అని ఆయన అన్నారు.ప్రజాపాలన అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన హస్తం పార్టీ నేతలు తెలంగాణలో సమస్యలను చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడో అటకెక్కించిన ప్రభుత్వ పెద్దలు బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన సంక్షేమ పథకాలకూ తిలోదకాలిచ్చారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని గద్దె నెక్కింది అని అన్నారు.మేము అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్ని అమలు చేస్తాం అని ఎన్నికల్లో ప్రతి వేదికలో చెప్పారు అని ఆయన గుర్తు చేశారు. ప్రజలను నమ్మించడానికి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనాడు గ్యారంటీ కార్డులను పంచి ప్రజలను మభ్యపెట్టింది అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 28 నెలలు కావస్తుంది కానీ ఏ ఒక్క హామీ కుడా సక్రమంగా అమలు చేయలేదు అని ఆయన అన్నారు.పథకాల అమలు తక్కువ... ప్రచారం ఎక్కువ అన్న తీరున కాంగ్రెస్ పార్టీ పాలన సాగుతుంది అని ఆయన అన్నారు.ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతి మహిళకు 2500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది కానీ ఇప్పటి వరకు అమలు కాలేదు ,వృద్ధులకు, బీడీ పెన్షన్ వాళ్లకు అధికారం లోకి రాగానే 4000 పెన్షన్ చేస్తాం అన్నారు కానీ కేసీఆర్ ఇచ్చిన 2000 మాత్రమే ఇస్తున్నారు. ఈ బడ్జెట్ లో పెన్షన్ ల పెంపు ఊసే లేదని అన్నారు.దివ్యంగులకు పెంచుతామన్న 6000 పెన్షన్ అమలకు బడ్జెట్ లో కేటాయింపులు లేవు అని,రైతు భరోసా 15,000, కౌలు రైతులకు 15 వేలు, రుణమాఫీ కానీ వారికీ 2,00,000 రుణమాఫీ ఈ బడ్జెట్ లో ప్రస్థావించలేదు అని ఆయన తెలిపారు.ఉపాధి హామీ కూలీలకు, ఆటో డ్రైవర్లకు సంవత్సరం కు 12,000 చొప్పున ఇస్తామని ఆరు గ్యారంటీల్లో చెప్పి బడ్జెట్ లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు అని,విద్యార్థులకు 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్,నిరుద్యోగ భృతి విద్యార్థులకు స్కూటి లు, ఫీ రియంబర్స్మెంట్ లను విస్మరించింది. ఇప్పటి వరకు పెళ్లిళ్లు అయినా ఆడబిడ్డలకు తులం బంగారం మాట బడ్జెట్ లో పొందుపరిచలేదు అని ఈ విధంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి బడ్జెట్ లో నిదులు కేటాయించకుండా ప్రజలను నమ్మించి మోసం చేసింది అని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్ర సంపాదనను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.బలహీన వర్గాలకు లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి, మూడు బడ్జెట్లు కలిపినా 20 వేల కోట్లకు మించకుండా కేటాయించడాన్ని ప్రశ్నించారు. సంక్రాంతికి రావాల్సిన డబ్బులు ఉగాది దాటినా రాకపోవడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు.పార్టీలో చేరిన వారిలో సంధ్య,అనిత, అనిల్,రమేష్,రాజు, శివ,వినయ్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విరమోని అంజి గౌడ్,పొట్ట మధు, కేతావత్ రుప్లా నాయక్, పొట్ట మురళి, పులిజాల జానీ,బొడ్డుపల్లి కృష్ణ, జమీర్ బాబా, లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట పీఏసీఎస్ క్లర్క్ ముదిగొండ ఎల్లయ్య ఘనంగా

- పదవి విరమణ కార్యక్రమం

జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 29:

యాదగిరిగుట్ట పీఏసీఎస్ క్లర్క్ ముదిగొండ ఎల్లయ్య పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి పలుగుల మైసమ్మ ఆలయం దగ్గర యాదగిరిగుట్ట పిఏసిఎస్ క్లర్క్ ముదికొండ ఎల్లయ్య పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 35 ఏళ్ల పాటు పీఏసీఎస్‌లో క్లర్క్‌గా ముదిగొండ ఎల్లయ్య ఎన్నో సేవలందించారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మాజీ డైరెక్టర్లు రమేష్‌నాయక్, బత్తిని రామకృష్ణ, మేకల రాజు, బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సీఈవో ఆంజనేయులు, బ్యాంక్ సిబ్బందితో పాటు నేతలు మాటూరి బాలయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, బహుపేట గ్రామ సర్పంచ్ కౌవిడే మహేందర్, మాజీ సర్పంచ్ బైరగాని పుల్లయ్య, ఆర్. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం



జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 29 :

తెలుగు రాష్ట్రాల ప్రజల ఆత్మగౌరవం తెలుగు దేశం పార్టీ అని ఆ పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి రేగు బాలనర్సయ్య అన్నారు. ఆదివారం టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని పలు చోట్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పార్టీ జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని,నారా చంద్రబాబు నాయుడు కూడా తెలుగు ప్రజల అభివృద్ధి కోసం, తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మచ్చనరసింహ గౌడ్,పట్టణ శాఖ అధ్యక్షుడు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల శ్రీశైలం యాదవ్, టిడిపి నేతలు శివరాత్రి కిష్టయ్య, దుర్గపతి కృష్ణ,సీసా రాజకుమార్ గౌడ్, శివరాత్రి యాదగిరి, నాగరాజు, రాళ్లబండి రాజు, చారి తదితరులు పాల్గొన్నారు.



## సత్తా చాటిన కాంగ్రెస్ నాయకులు

- టాప్ 100 పవర్ ఫుల్ జాబితాలో 25వ స్థానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

టాప్ 100 పవర్ ఫుల్ ఇండియన్ జాబితాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తా చాటారని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. ఇందులో 9వ స్థానంలో రాహుల్ గాంధీ, 25వ స్థానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, 35వ స్థానంలో ప్రియా గాంధీ, 43వ స్థానంలో మల్లికార్జున ఖర్గేలు ఉన్నారన్నారు. భారీ ప్రజాదరణ కలిగిన నాయకులు రికార్డు సృష్టించారని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

## దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

- తెలంగాణ రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరిన దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొణిదెల నరేష్



జయభేరి, యాదాద్రి భువనగిరి జిల్లా :

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని,వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కొడిదెల నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ఐటీ,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి దివ్యాంగుల సమస్యలను వివరించారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆయన కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు దివ్యాంగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని,వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపినట్లు చెప్పారు.

## ఘనంగా బిఆర్ అంబేద్కర్ 160వ వార్షిక జ్ఞానమాల

- డా.బి.ఆర్.ఆంబేద్కర్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు
- రాజకీయ సామాజిక ఉద్యమాల్లో ముందు నడవాలి
- ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చెప్పినట్టుగా చదువుకోవాలని పిలుపు
- ముఖ్య అతిథిగా మడం కె.ఏ.లక్ష్మి, ఆంబేద్కరైట్, డా.బి.ఆర్.ఆంబేద్కర్ జాతీయ ఎస్సీ/ఎస్టీ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు

జయభేరి, లోతుకుంట :



డా.బి.ఆర్.ఆంబేద్కర్ సంఘం, లోతుకుంట ఆధ్వర్యంలో డా.బి.ఆర్.ఆంబేద్కర్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, లోతుకుంట "ఎక్స్" రోడ్, అల్వాల్ వారు 160వ వార్షిక జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా మడం.కె.ఏ. లక్ష్మి, ఆంబేద్కరైట్, డా.బి.ఆర్.ఆంబేద్కర్ జాతీయ ఎస్సీ/ఎస్టీ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు, మహిళా సాధికారతపై శిక్షణ & ఆత్మగౌరవంపై ప్రాధాన్యత ఇచ్చారు. ఆమె మహిళలకు మాటల దృశ్యాన్ని విడిచిపెట్టాలని, శుభ్రతను నిర్వహించాలని, తమ పిల్లలను చదివించాలని, రాజకీయ/సామాజిక ఉద్యమాలలో పాల్గొనాలని, "మీరు బాధపడటానికి పుట్టలేదు, మీరు వివేకాన్ని పొందటానికి పుట్టారు" అని ప్రఖ్యాతంగా పేర్కొన్నారు. డా.బి.ఆర్.ఆంబేద్కర్ చెప్పారు, మహిళలను సేవకులుగా కాకుండా భాగస్వాములుగా చూడాలని, వారికి తమ భర్తల జీవితాలలో సమాన భాగస్వాములు కావాలని ప్రోత్సహించారు. మరొక ముఖ్య అతిథి మడం. సువర్ణ, సీనియర్ ఆంబేద్కరైట్, డా.బి.ఆర్. ఆంబేద్కర్ దేశంలోని ముఖ్యమైన హక్కుల, రాష్ట్ర విధాన సూత్రాలను నిర్మించిన పాత్రను అభినందించారు. ఆయన ఆవేదనపై, సర్వ ప్రజలకు సమాన హక్కులు, సాధికారతను ఇచ్చేందుకు రాజ్యాంగం ద్వారా ఎస్సీ/ఎస్టీ, పేదలకు ప్రత్యేకమైన హక్కులు ఇచ్చినట్లు చెప్పారు. ఆమె ఆహ్వానించారు, ఆంబేద్కర్ గౌరవించే వ్యక్తులను మద్దతు ఇవ్వాలని, ఆత్మగౌరవం నెరవేర్చేందుకు వారి సంకల్పాన్ని కొనసాగించాలన్నారు. డా.బి.ఆర్.ఆంబేద్కర్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకుంది, 31.03.2026 న సెకుందరాబాద్ కాంతోన్మాల భవనం CEOకు మెమోరాండం సమర్పించాలని, సెకుందరాబాద్ కాంతోన్మాలలో ఉన్న అన్ని డా.బి.ఆర్.ఆంబేద్కర్ విగ్రహాల, కాంపౌండ్ వాల్ మరమ్మతుల నిర్వహణ కోసం. డా.బి.ఆర్. ఆంబేద్కర్ మిషన్ వృద్ధులు, నాయకులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పేద బలహీన వర్గాల అభివృద్ధి, రక్షణ గురించి మాట్లాడారు. బాబాసాహెబ్ డా.బి.ఆర్.ఆంబేద్కర్ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు.



ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన ఆనంతరాజ్, రమేష్‌కమల, డా.మురళి, చార్లినరాజ్, పురం.కన్నయ్య, సి.సురేష్‌ఢిల్లీ, శివశంకర్, కే.ఎమ్.సురేష్, కే.ఎన్.లక్ష్మణ్, ఓంకార్, మహేందర్, శివలింగం, రావెన్ష్, హిమశ్రీ, వికాస్, హరిణి పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం.. పండుగ

- మౌంట్ జీయన్ మినిస్ట్రీస్.. ఆధ్వర్యంలో భారీ ర్యాలీ..

జయభేరి, మౌలాలి :



హెచ్ బికాలనీ ఇందిరా నగర్ ఫేస్ 2లో మౌంట్ జియన్ మినిస్ట్రీస్ మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవ కె. ఊర్మిళనంద్ మొదటిగా ప్రార్ధన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారీగా సంఘస్తులు, యవ్వనస్తులు ముఖ్యంగా చిన్నారులతోపాటు ముఖ్య అతిథిగా 4వ డివిజన్ కార్పొరేటర్ జీరపోతుల ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.. క్రైస్తవ జీవితంలో నిరీక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవడానికి అలాగే ప్రభువైన యేసు క్రీస్తు మట్టల ఆదివారం రోజున ఆయనను ప్రార్ధించి ఊరేగించిన సందర్భాన్ని గుర్తు చేసుకొని చిన్న పిల్లలందరూ మట్టలు పట్టుకొని హోసన్నా జయం జయం అని ఉత్సాహంగా పాటలు పాడుకుంటూ కాలనీలో ప్రభు యేసును ఆరాధించారు. ఈ ఆదివారం ఆరాధన అన్నింటిని సంఘ కాపరి రెవ కే. ఊర్మిళనంద్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు కే. ఇస్తేరమ్మ కె. మరి, టీ సౌజన్య, కనకదుర్గ,కే.ఆనంద్ కుమార్ స్టీఫెన్ స్టెల్లా కే ఆనంద్ కుమార్, ఏంజెల్ నేరయ్య, స్టెన్సి, నిధి జాన్, శ్రేష్ఠ తదితర సభ్యులు ఈ కార్యక్రమంలో ఘనంగా దేవుణ్ణి ఆరాధించి ఊరేగింపుగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## క్రీడా విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

క్రీడారంగంలో తన ప్రతిభను చాటుతూ క్రికెట్ షెడ్యూల్, టెన్నిస్ భాగాల్లో అద్భుత ప్రదర్శనతో ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆకట్టుకున్నారు.హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గత రెండు రోజులుగా తెలంగాణ లెజెండ్ స్పోర్ట్స్ మీట్ 2026 ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా తొలి ఎడిషన్ రెండో రోజు కార్యక్రమం క్రీడా ఉత్సాహంతో కళకళలాడింది. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) క్రీడా రంగంలో తన ప్రతిభను చాటుతూ క్రికెట్, షటిల్, టెన్నిస్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన తో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. క్రీడలు, కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, క్రమశిక్షణ, నాయకత్వం వంటి విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ క్రీడా ఉత్సవం ఫిట్ లీడర్స్ ఫిట్ స్టేట్ అనే నినాదానికి తగినట్లుగా నాయకుల్లో ఫిట్‌నెస్ పై అవగాహన పెంచుతూ, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## వేసవికాలంలో తీవ్ర ఎండల కారణంగా దాహార్తి




జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గంలో HMT నగర్ డివిజన్ హైపర్ మాట్ పక్కన డిడిఎల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డి శరత్ బాబు వారి ఆధ్వర్యంలో ఉచిత అంబలి సేవా శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ రాగిడి లక్ష్మారెడ్డి విచ్చేసి తన చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది, అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వేసవికాలంలో తీవ్ర ఎండల కారణంగా ప్రతి ఒక్కరి దాహార్తిని తీర్చాలని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారు నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు సాయిజెన్ శేఖర్ మేడల మల్లికార్జున్ గౌడ్, ట్రస్ట్ మెంబర్స్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 2026, 27 వార్షిక బడ్జెట్ సమావేశం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పురపాలక సంఘం నందు 202627 ఆర్థిక సం. వార్షిక బడ్జెట్ సమావేశం మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ అధ్యక్షతన మునిసిపల్ కమీషనర్ పూర్ణచందర్ సమక్షంలో ఈ వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 202627 ఆర్థిక సం. సంబంధించి ప్రభుత్వ గ్రాంట్లు కలుపుకొని మునిసిపల్ ఆదాయం 51 కోట్ల 90 లక్షల 79 వేలు , 202627 బడ్జెట్ అంచనా ఖర్చు 55 కోట్లు 25 లక్షల 39 వేలు బడ్జెట్ ను కౌన్సిల్ సభ్యులు ఎకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఇట్టి సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీమతి జువేరియా తబస్సుమ్, కౌన్సిలర్లు, మేనేజర్ అర్చన, అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, టి. పి.యస్. వర్షిక, జూనియర్ అకౌంటెంట్ పద్మ మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు

- సర్పంచి నల్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్సై పిల్లల రాజు



జయభేరి, దంతాలపల్లి, మార్చి29 :

మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచి నల్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామంలో నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలను) ఎస్సై పిల్లల రాజుతో ఏర్పాటు చేయించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దొంగతనాలు జరగకుండా నిఘా ఏర్పాటు కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరో పోలీసుల అవి గ్రామాన్ని కాపాడతాయని అన్నారు అన్ని గ్రామాల్లో కూడా సీసీకెమెరాలు ఏర్పాటు వలన గ్రామానికి రక్షణగా ఉంటాయని ప్రతి ఒక్కరు కూడా అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామ పాలకవర్గం మరియు యువత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీతారామ ఆలయంలో ఘనంగా గరుడ సేవ

- పురవీధుల్లో స్వామి వారి విగ్రహాల ఊరేగింపు



జయభేరి, శామీర్ పేట్, మర్చి 29 :

శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్ పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో గల శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు కందాళ సీతారామ చార్యులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత, డీఈ సంతోష్ , అసిస్టెంట్ కమిషనర్ శ్రావణ్ కుమార్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించిన ఆలయ సిబ్బందినీ ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు పేండం లక్ష్మినారాయణ, దాసరి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు తిరుపతి లావణ్య శంకర్ గౌడ్, గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వలందాసు సునీత లక్ష్మి, బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షులు పట్నం నర్సింహారెడ్డి, మాజీ ధర్మకర్తలు ఎల్లెంకి భారతి, వలందాసు మురళి గౌడ్, బక్కోల శ్రీనివాస్, భక్తులు సింగం రామరావు, పిన్నింటి ధర్మారెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, బర్ల అనంత రెడ్డి, తిరుపతి అంజనేయులు, కట్ట అనంత రెడ్డి, బెబండి జంగారెడ్డి, నాళ్ళచెరువు శంకరప్ప, రంగప్పగారి నాగరాజు గౌడ్, పన్నాల నితిన్ రెడ్డి, పన్నాల జనార్ధన్ రెడ్డి, కైరంకొండ మధుసూదన్, మేటె బాలయ్య, మిర్యాలకర్ సాయి కుమార్, రాచ కార్తీక్, బర్రెంకబావి కిషోర్ సాయిరెడ్డి, బర్రెంకబావి శ్రావంత్ రెడ్డి, కట్ట శశిధర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సత్తెనపల్లి రూరల్ సిఐ కిరణ్

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుని పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలింపు

జయభేరి, సత్తెనపల్లి :

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలెం వద్ద ఆటో బోల్తాబడింది. ఘటన ఒక బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పదో తరగతి పరీక్షలు ముగించుకొని అటుగా వెళుతున్న విద్యార్థులు బాలుని బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అటువైపుగా వస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్ హుటాహుటిన సంఘటన ప్రాంతానికి వచ్చి చలించి పోయారు. పోలీసు వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బాలుడు బంధువులకు సమాచారం అందించారు.

# ప్రజాప్రతినిధుల సాంస్కృతిక వేడుక

జయభేరి, హైదరాబాద్ :



శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని నిర్వహించిన ప్రజాప్రతినిధుల సాంస్కృతిక వేడుకలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడలు, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యమంత్రితో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చిన ప్రదర్శనలను తిలకించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "నిరంతరం ప్రజా సమస్యలతో క్షణం తీరిక లేకుండా ఉండే ప్రజాప్రతినిధులు క్రీడలు, వారు ప్రదర్శించిన కళలు రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థినీ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయి. చాలా మంది తమ విద్యార్థి దశలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ, వృత్తి జీవితంలో స్థిరపడిన తర్వాత తమలోని కళను, నైపుణ్యాలను మరిచిపోతున్నారు. ఈ మధ్యకాలంలో నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే విద్యార్థులు కొందరు వ్యసనాలకు బానిసలవుతున్నారు. విద్యార్థినీ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలన్న ఉద్దేశంతోనే గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ పోటీలు నిర్వహించాం. చదువులో రాణిస్తేనే భవిష్యత్తు ఉంటుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మైదానాల్లో రాణించినా మంచి భవిష్యత్తు ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆ సంప్రదాయం కనుమరుగైంది. శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్ గారి విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమాలను పునరుద్ధరించాం. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలి" అని కోరారు. అద్భుతమైన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు క్రీడలు, సాంస్కృతిక శాఖలను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంత్రి వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు కేఆర్ నాగరాజ్, జాటోత్ రామచంద్ర నాయక్, ఆది నారాయణ, శంకర్ నాయక్, వెడ్మ బొజ్జు, తెల్లం వెంకట్రావు, రాందాస్ మాలోత్, మందల సామెల్ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌లో విజేతలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి చేతుల మీదుగా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో రాణించిన ముఖ్యమంత్రి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు.



# ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు అందుకున్న కావేరి యూనివర్సిటీ

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు

జయభేరి, గజ్వేల్, మార్చి 28 :



సిద్దిపేట జిల్లా గౌరారం శివారులోని కావేరి యూనివర్సిటీ ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు దక్కించుకుంది. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ హర్ష పోల్సాని అవార్డు అందుకున్నారు. చక్కటి సాంకేతిక నైపుణ్యం, నూతన ఆవిష్కరణలు సత్ఫలితాలిస్తుండగా, విద్యార్థుల పట్ల సంస్థ అంకితభావం, నిబద్ధత, అందుతున్న పరిజ్ఞానం దృష్టిలో పెట్టుకొని కావేరి విశ్వవిద్యాలయానికి ఉత్తమ యూనివర్సిటీ అవార్డు దక్కినట్లు కావేరి యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ భాస్కర్ రావు స్పష్టం చేశారు. వ్యవసాయం, సాంకేతికత ఆధారిత పరిష్కారాల్లో నూతన పరిశోధన, పరిశ్రమలకు అనుగుణమైన కోర్సులు, స్థిరమైన అభివృద్ధి, ఉన్నత విద్యకు కావేరి యూనివర్సిటీ అందిస్తున్న గొప్ప గుర్తింపుకు ఈ అవార్డు ప్రామాణికంగా నిలిచిందని వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. హైదరాబాదులో శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరైన వారు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

- 1975 76 విద్యా సంవత్సర విద్యార్థులు
- ప్రధానోపాధ్యాయులకు ఈ వేణుమాధవ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది

జయభేరి, దంతాలపల్లి, మార్చి29 :



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975, 76 విద్యా సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ప్రస్తుత ప్రధాన ఉపాధ్యాయులు ఈ వేణుమాధవ్ రెడ్డి అధ్యక్షుడుగా ఘనంగా నిర్వహించారు పూర్వ విద్యార్థులు ఆనాటి పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులతో ఆత్మీయంగా కలిసి మాట్లాడుతూ వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు వారు ఆడి పాడిన స్థలంలో చదివిన పాఠశాల గదులను చూసి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో ఆత్మీయంగా కలవడం సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యను బోధించిన అలనాటి ఉపాధ్యాయులు శ్రీ లక్ష్మీనారాయణ, ప్రసాదరావు, పి మోహన్ రెడ్డి గండి మురళి వీరిని సన్మానించిన పూర్వ విద్యార్థులు సన్మానించిన పూర్వ విద్యార్థులు కే బిక్షపతి, ఎం రామయ్య హర్షవర్ధన్ రెడ్డి, వేణు మాధవరెడ్డి,మల్లీశ్వరి పుష్పలత, విజయలక్ష్మి చంద్రయ్య, అబ్బసాయిలు వెంకటరెడ్డి,సరాజుద్దీన్ యాకూబ్ వెంకటమ్మ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డొమెస్టిక్ సిలిండర్స్ ఇవ్వాలి

- తినుబండారాల దుకాణాల హోటల్స్ నేడు బంద్ కు పిలుపు
- గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్స్ వాడుతున్నాం
- సిలిండర్లు లేకపోతే అన్ని తిరువ్యాపారాలు హోటల్స్ నడపలేక పోతున్నాం
- అన్ని వ్యాపారాలకు ముడిపడి ఉన్న సిలిండర్లు
- సివిల్ సప్లై అధికారులు తమకు న్యాయం చేయాలి

జయభేరి, దేవరకొండ :



రోడ్డుపై స్టాల్స్ మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఏ చిన్న తిను పదార్థాల బండిపై గ్యాస్ తోనే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దేవరకొండ పట్టణంలో డెమోస్టిక్స్ సిలిండర్ల కొరత కారణంగా గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్లు వాడడం అవి వెంటనే సివిల్ సప్లై ఎన్ఫోర్మెంట్స్ అధికారులు సిలిండర్లను స్వాధీనం చేస్తుండడంతో చేయడంతో దిక్కు తోచని స్థితిలో రోడ్డుపై తినుబండారాల కట్లలీస్ గప్చుప్ దోషబండ్ల ఫాస్ట్ ఫుడ్ భోజన హోటల్స్ రెస్టారెంట్లు వ్యాపారులు గందరగోళంలో అయోమయ పరిస్థితిలోకి వెళ్లారు. దేవరకొండ పట్టణంలోని తినుబండారాలు హోటల్ గప్చుప్ రెస్టారెంట్ టీ స్టాల్ లో ఫాస్ట్ ఫుడ్ మిర్చి బండి దోష బండి వ్యాపారం చేసే గత నెల రోజులుగా మార్కెట్లో కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామంటూ దేవరకొండ పట్టణానికి చెందిన చిరు వ్యాపారులుతెలిపారు. ఆదివారం వ్యాపారులంతా కలిసి గత్యంతరం లేక కమర్షియల్ సిలిండర్లను వాడుతున్నామని తమకు సివిల్ సప్లై అధికారులు డెమోస్టిక్ సిలిండర్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అర్ధాంతరంగా సిలిండర్లను సీజ్ చేసి ఫైన్లు వేస్తే తమ కుటుంబాలు ఎలా బతుకుతాయని వారు తెలిపారు. సమస్యలను అధిగమించేందుకు తమకు పరిష్కారం చూపాలని తెలిపారు.



## చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి

- వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయి
- కౌన్సిలర్ గుర్క కుమార్ యాదవ్

జయభేరి, శామీర్ పేట్, మర్చి 29 :

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి అన్నారు. అలియాబాద్ లోని శ్రీరామ ఆటో యూనియన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వలన బాటసారుల దాహార్తి తీర్చేందుకు దోహదపడుతుందన్నారు. మానవసేవే మాధవసేవ అనే భావంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, గాదె వెంకటేష్,గుర్క కుమార్ యాదవ్, యమున శ్యామ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు పులి జగదీష్, యాదయ్య, మాఫిస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రిపాలెం టిడ్కో ఇండ్లు ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పంచకర్ల



జయభేరి, పరవాడ:

జీవీఎంసీ పరిధిలో 85 వ వార్డు మంత్రిపాలెం గ్రామంలో టిడ్కో ఇండ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొనచున్నారని జనసేన ముఖ్య నాయుకులు తెలియజేసారు. దీనికి సంబందించిన ఏర్పాట్లును ఆదివారం పరవాడ మండల జనసేనపార్టీ ఇంచార్జి పంచకర్ల ప్రసాద్ పరిశీలించి అధికారులకు కాంట్రాక్టర్ గారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఉమ్మడి ఎన్డీఏ మహా కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయమని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు,దుల్ల రామునాయుడు,ఇల్లపు ప్రసాదు,బుగిడి రామ గోవిందరావు, వెన్నెల నరసింహారావు,పచ్చికోరు లక్ష్మి, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ లో ఖైదీ పరారీ

జయభేరి, గుంటూరు ;

గుంటూరు జీజీహెచ్ (GGH)లో రిమాండ్ ఖైదీ పరారీ అయిన ఘటన కలకలం రేపింది.చేబ్రోలు ప్రాంతంలో నమోదైన హత్య కేసులో నిందితుడు నాగుల్ మీరా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతడిని వైద్య పరీక్షల కోసం గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (GGH) కు జైలు పోలీసులు తీసుకువచ్చారు. ఈ సమయంలో పోలీసుల కళ్లుచెదరగొట్టి ఖైదీ అక్కడి నుంచి పారిపోయాడు.

# ఎలాంటి ఇబ్బందులు రాకుండా పుష్కరఘాట్ల అభివృద్ధి

**జయభేరి, హైదరాబాద్ :**



2027 జూన్‌లో జరగబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. పుష్కరాల కోసం బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఆలయాలు, పుష్కరఘాట్ల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులతో శాసనసభ సమావేశ హాలులో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.
2027 జూన్ గోదావరి పుష్కరాలు నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. అందుకోసం రూపొందించిన ప్రణాళికలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాటిపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి ఇంజనీర్లతో టెక్నికల్ కమిటీని నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే 15 లేదా 20 రోజుల్లో నివేదికను సమర్పించాలని చెప్పారు. ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను రూపొందించి మంత్రివర్గ ఉప సంఘానికి పంపించాలని, ఉప సంఘం ఆమోదించిన తర్వాత గోదావరి పుష్కరాల సమగ్ర ప్రణాళికపై మంత్రి మండలి తుదినిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పుష్కరాల కోసం శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల నిర్మాణం, విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించే భక్తులు, పర్యాటకులకు ఇబ్బందులు రాకుండా ప్రాంతాల మధ్య కనెక్టివిటీ సరిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఈ సందర్భంగా అధికారులు వివరించగా, ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.



## ఇందిరమ్మ ఇండ్లు లబ్ధి పొందిన వారి ఇంటి భూమి పూజ

**జయభేరి, ఘట్కేసర్ :**

ఘట్కేసర్ దగ్గర 6వ డివిజన్ అంబేద్కర్ నగర్, గుంటి గూడెంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు లబ్ధి పొందిన వారి ఇంటి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఘట్కేసర్ మునిసిపల్ మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, అధ్యక్షులు ముత్యాలు యాదవ్. ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ ఇళ్లు" పథకం నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేస్తోంది. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి ₹5 లక్షల ఆర్థిక సహాయం, ఇంటి నిర్మాణం కోసం ఈ మొత్తాన్ని 100% సబ్సిడీతో అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఇళ్లు కట్టుకునే వారికి దరఖాస్తుదారులే బ్రాండ్ అంబాసిడర్లు.

**ఇందిరమ్మ ఇంటి పథకం యొక్క ప్రత్యేకతలు & ప్రయోజనాలు..**

**100% సబ్సిడీ:** ఇది రుణ పథకం కాదు, పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో ఇళ్లు నిర్మించుకునే అవకాశం.

**ఆర్థిక సహాయం:** సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి ₹5 లక్షలు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమవుతాయి.

**నిర్మాణ స్వేచ్ఛ:** లబ్ధిదారులు తమకు నచ్చిన డిజైన్‌తో, సొంతంగా ఇల్లు కట్టుకునే అవకాశం ఉంది.

**నియోజకవర్గానికి 3500+ ఇళ్లు:** ప్రతి నియోజకవర్గానికి సుమారు 3500 ఇళ్లు మంజూరు చేస్తారు, అదనంగా ఎస్టీ నియోజకవర్గాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు.

**పాత ఇండ్ల విస్తరణ:** పాత ఇందిరమ్మ ఇండ్లను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 (L1, L2, L3) కేటగిరీలుగా వర్గీకరించి, అర్హులైన వారికి అదనపు సదుపాయాలు కల్పిస్తారు.

ఈ పథకం కోసం దరఖాస్తులను, ఆన్‌లైన్ లేదా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా (ప్రజాపాలన) సమర్పించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, మాజీ వార్డు సభ్యులు సాల్లూరి నర్సింగ్ రావు, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ్ రెడ్డి, sc సెల్ ప్రధాన కార్యదర్శి సునీల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శివ, నాయకులు కాయుమ్, కడుపొల్ల రాజు, యాదగిరి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు కేటీఆర్ వార్నింగ్

- 'మూడేళ్లలో వస్తాం.. వడ్డీతో సహ చెల్లిస్తాం'

**జయభేరి, హైదరాబాద్ :**



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కలెక్టరు, పోలీసు అధికారులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లలో తాము అధికారంలోకి వస్తామని.. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని.. అప్పుడు పోలీసులు, ఐఏఎస్ అధికారులు లెక్కలు తేల్చుతామని హెచ్చరించారు. పోలీసులు.. కాంగ్రెస్ నేతలు చెప్పినట్టల్లా ఆడుతూ.. బీఆర్ఎస్ నాయకుల పై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి అధికారులందరి పేర్లు బుక్కులో రాసి పెట్టుకుంటున్నామని హెచ్చరించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ భార్యపై అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టారని.. అసలు ఆ పోలీసులు మనుషులా, పశువులా అంటూ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్‌ను బీఆర్ఎస్వీ విలీనం చేసిన సందర్భంగా శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నిన్నగాక మొన్న మా తమ్ముడు గెల్లు శ్రీనివాస్ దగ్గరకు వెళ్లాం. అతనేవరో థంబ్నెయిల్స్.. థంబ్నెయిల్స్ అని ఇష్టం వచ్చినట్లు వీడియోలు పెడితే.. అతడికి కడుపు మండి ఓ పది మందిని తీసుకొని వెళ్లి శాంతియుతంగా నిరసన తెలియజేశాడు.
దీనికే ఆయనపై అంటెప్ట్ మర్డర్ కేసు పెట్టారు. కోర్టుకు వెళ్తే దీనిలో ఏముందని రిలీఫ్ ఇచ్చిందని చెప్పుకొచ్చారు' అని తెలిపారు. 'ఇక్కడ మరో విచిత్రమైన అంశం ఎంటంటే.. పోలీసులు.. గెల్లు శ్రీనివాస్ భార్య మీద కూడా అటెంప్ట్ మర్డర్ కేసు ఫైల్ చేశారు. అసలు ఆమె బయటకు వచ్చిందా.. నిరసనల్లో పాల్గొన్నదా.. అనే విషయం కూడా తెలుసుకోకుండా ఆమె మీద ఇంత పెద్ద కేసు పెట్టారు. అది కూడా ఎందుకు.. శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసేందుకు ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులకు ఆమె తన మొబైల్ ఇవ్వలేదు. అందుకే ఆమె మీద కూడా అటెంప్ట్ మర్డర్ కేసు ఫైల్ చేశారు. అసలు ఎలాంటి సంబంధం లేని ఆ అమ్మాయి మీద కేసు పెట్టిన పోలీసులను నేను ఒక్కటే ప్రశ్నిస్తున్నాను.. మీరు మనుషులా.. పశువులా.. బుద్ధి, జ్ఞానం ఉండి ఉద్యోగం చేస్తున్నారా.. లేక గడ్డి తిని చేస్తున్నరా' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూడేండల్లో వస్తం.. ఒక్కొక్కనికీ మిత్తీతో సహా ఇస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. అక్రమ కేసులు పెట్టే అధికారులు ఎవరైనా సరే చివరకు కలెక్టర్ అయినా.. సరే భయపడేది లేదు. అందరి పేర్లూ రాసి పెట్టుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచిస్తున్నాను. సర్కారుకు తొత్తులుగా పనిచేస్తున్న అధికారులు, పోలీసుల లెక్కలు తేల్చేది పక్కా అంటూ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ కాదు కదా ఆయన ముత్తాతలకు కూడా భయపడేది లేదని తెలిపారు. సోనియాగాంధీ రాసిన ఉత్తరంలో ఏముందో చదవడం రాక.. అదేదో తనకు ఆస్కార్ అవార్డు వచ్చినట్టు రేవంత్ రెడ్డి మురిసిపోతున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయనకు ఆస్కార్ కాదు భాస్కర్ అవార్డు ఇవ్వాలని ఎగతాళి చేశారు.



## డిసిసి డాక్టర్స్ సెల్ చైర్మన్ గా డాక్టర్ ముడుంబై గిరిధర్

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 29 :**

యాదగిరిగుట్ట పట్టణ చెందిన డాక్టర్.ముడుంబై గిరిధర్ యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) మెడికల్ అండ్ హెల్త్ విభాగం డాక్టర్స్ సెల్ చైర్మన్ గా నియమితులయ్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కమిటీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్ ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తన చేతుల మీదుగా నియామక పత్రాన్ని డాక్టర్ గిరిధర్ కు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని.. పదవికి వన్నె తీసుకురావాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, 11వ వార్డు కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బంధారపు బిక్షపతి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి యాదాద్రి భువనగిరి జిల్లాలో కీలక పదవి తనకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధుల సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని డాక్టర్ గిరిధర్ అన్నారు.



## ప్రమాద రహిత ప్రయాణం కోసం అందరూ సహకరించాలి

- పరవాడ పోలీసులు శాఖ విజ్ఞప్తి





**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచేందుకు ఆదివారం కొత్త చర్యలు చేపట్టబడినవి. జంక్షన్ వద్ద రేడియం స్టిక్కరింగ్ చేసిన డ్రమ్ములు, టైర్లు, ఇనుప స్టాపర్లు మూడు లేయర్లుగా ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్ల ద్వారా గాజువాక వైపు నుంచి లంకెలపాలెం జంక్షన్‌కు వచ్చే వాహనాలు జంక్షన్ వద్దకు చేరుకునే సమయంలో స్వయంగా వేగం తగ్గించే విధంగా చర్యలు తీసుకొబడ్డాయి. దీంతో ప్రమాదాలను నివారించడం, ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.లంకెలపాలెం వద్ద ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పరవాడ పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని కోరడమైనది. జంక్షన్ వద్దకు చేరుకునే ప్రతి వాహనదారుడు అప్రమత్తంగా, నెమ్మదిగా వాహనం నడపాలని పోలీసులు తెలియజేసారు.

# గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం

- ముఖ్యమంత్రితో ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ బృందం భేటీ


**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణలో గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ఆలయాల సమీపంలో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. శాసనసభ సమావేశ హాలులో ముఖ్యమంత్రితో ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ బృందం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, CS కె. రామకృష్ణారావుతో పాటు CURE పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ కోసం చేపట్టిన చర్యలను అధికారులు మేనకా గాంధీకి వివరించారు. మున్సిపాలిటీల వ్యాప్తంగా వీధి కుక్కలకు నిర్వహిస్తున్న స్టెరిలైజేషన్ ప్రక్రియ వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జంతువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను అధికారులు మేనకా గాంధీ బృందానికి తెలియజేశారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా మేనకా గాంధీ కొనియాడారు.

## తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జయభేరి, పరవాడ:**



తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, పేదల పక్షపాతి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం పరవాడ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని తలపించారు. స్థానిక సీనియర్ నాయకులు పరవాడ సంతబయలు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం, కేక్ కట్ చేసి కార్యకర్తలకు తీపి పదార్థాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా 44 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ వేసిన పునాది, నేడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేస్తోంది. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎప్పుడూ ఉండాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి పైలా రామచంద్రరావు, గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు పైల బుజ్జి, పయిల కృష్ణ,గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రీ చంద్రశేఖర్, పోతల గోపి, గండి ప్రవీణ్, చుక్క మురళి ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

## గ్లోబల్ వార్మింగ్ నుంచి రక్షణకు అతి సాంద్ర అడవులు పెంపకం ఒక్కటే పరిష్కారం

- తిరుపతి ఐఐటి రిజిస్టార్ చమన్ మెహతా



**జయభేరి, పరవాడ:**

విశాఖ ఫార్మాసిటీ ప్రాంగణములో రామ్కి ఇన్ఫ్రాస్ట్రక్చర్ సహకారంతో రామ్కి ఫౌండేషన్ మరియు క్యాచ్ ఫౌండేషన్ ఉమ్మడిగా అభివృద్ధి చేస్తున్న మియావాకి ఫారెస్ట్ కార్యక్రమంలో చెట్లు నాటే కార్యక్రమాన్ని ఆదివారం తిరుపతి ఐఐటి రిజిస్టర్ చమన్ మెహత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలలో పారిశ్రామికీకరణ కారణంగా పట్టణాలు అభివృద్ధి చెంది వృక్ష సంపద తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు . దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ ఏర్పడి వాతావరణం పై తీవ్ర ప్రభావాన్ని చూపెట్టడమే కాకుండా వాతావరణం ప్రతికూల ప్రభావాన్ని చూపెడుతూ అధిక వర్షాలు, అధిక వేడి, అధిక చలికి కారణం అవుతున్నాయన్నారు. మానవ ఆరోగ్యం పై వాతావరణ అసమతుల్యత తీవ్ర ప్రభావాన్ని చూపెడుతున్నాయన్నారు . చెట్ల పెంపకాన్ని మనం అశ్రద్ధ చేయటం వలన స్థానికంగా పెరిగే వృక్ష సంపద నశిస్తుంది చివరకు పక్షుల నివాసానికి కూడా ఇబ్బందికరంగా మారి పక్షి సంపద నశించి పర్యావరణ సమతుల్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయన్నారు. అతి సాంద్ర అడవులు పెంపకం ద్వారా ఒక ఎకరా స్థలములో 30 రకాలైన 5000 చెట్లను పెంచడం వలన స్థానికంగా లభించే వృక్ష సంపదను సంరక్షించడమే కాకుండా పక్షులకు ఆహారాన్ని అందించడం, ఆక్సిజన్ శాతాన్ని పెంచడానికి ఎంతగానో మియావాకి ఫారెస్టు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రయోగాత్మకంగా అనకాపల్లి జిల్లాలో మియావాకి ఫారెస్ట్ అభివృద్ధి చేస్తున్నందుకు విశాఖ ఫార్మాసిటీ రామ్ కి ఇంఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రాంకి ఫౌండేషన్ వారిని ఈ సందర్భంగా కొనియాడారు.పర్యావరణ పరిరక్షణకు రాంకీ గ్రూప్ కంపెనీలు ముందు వరుసలో ఉంటాయని అందులో భాగంగా ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి విశాఖ ఫార్మాసిటీ ప్రాంగణం ఎంచుకోవడం జరిగినదన్నారు . వచ్చే సంవత్సరం విశాఖ ఫార్మాసిటీ ప్రాంగణంలో మరిన్ని ఫారెస్ట్ బ్లాకులను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలియజేశారు .అంతకుముందు క్యా క్యాష్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్, నేహా గుప్త మియావాకి ఫారెస్ట్ ఉపయోగాలను వివరించడమే కాకుండా , రామ్కీ ఫౌండేషన్ తో పాటు క్యాచ్ ఫౌండేషన్ వారికి మియావాకి అడవులను అభివృద్ధి చేసే అవకాశాన్ని కల్పించినందుకు విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి . లాల్ కృష్ణకి ,అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో రామ్ ఉన్నతాధికారులు మాధవ్, గిరిధర బక్షి , రాఘవరెడ్డి, ఎర్రయ్య, రాంకీ గ్రూప్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపు

**జయభేరి, హైదరాబాద్ :**

రేషన్ కార్డులు ఉన్నవారికి శుభవార్త. ఏప్రిల్, మే, జూన్ నెలల కోటా రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి 18 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీఐ వద్ద భారీగా బియ్యం నిల్వలు ఉండటంతో కొత్తగా వచ్చే ధాన్యానికి చోటు లేకుండా పోయింది. వాటిని ఖాళీ చేసేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.




# ముంబై.. కోల్‌కతాపై విజయం

- **2012 తర్వాత తొలి మ్యాచ్‌లో గెలుపు**
- **రాణించిన రోహిత్, రికెల్టన్**
- **రహానే, రఘువంశి పోరాటం వృథా**

**జయభేరి, ముంబై :**

ఐపీఎల్‌లో తొలి మ్యాచ్‌ను ఓటమితో ఆరంభించే ముంబై ఇండియన్స్ ఈసారి రూటు మార్చింది. 2012 (చెన్నై సూపర్ కింగ్స్‌పై) తర్వాత ఆ జట్టు మొదటిసారి సీజన్ ఆరంభ మ్యాచ్‌ను గెలుచుకుని వరుసగా 13 ఓటముల పరంపరకు ముగింపు పలికింది. ఆదివారం వాంఖడేలో హార్దిక్ సేన.. 6 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)ను చిత్తుచేసి గెలిచి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. బంతితో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ప్రత్యర్థి నిర్దేశించిన 221 పరుగుల లక్ష్యాన్ని మరో 5 బంతులుండగానే బాదేసి రికార్డు విజయాన్ని నమోదుచేసింది. ర్యాన్ రికెల్టన్ (43 బంతుల్లో 81, 4 ఫోర్లు, 8 సిక్స్‌లు), 'ముంబై చ రాజా' రోహిత్ శర్మ (38 బంతుల్లో 78, 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) వీరవిహారం చేయడంతో ఆ జట్టు 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. కెప్టెన్ అజింక్యా రహానే (40 బంతుల్లో 67, 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), అంగ్‌క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 51, 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో నిర్ణీత ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 220 రన్స్ చేసింది. ఛేదించాల్సిన లక్ష్యం భారీగా ఉన్నా బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ముంబై ఓపెనర్లు ప్రత్యర్థి బౌలర్లను ఆటాడుకున్నారు. రోహిత్, సఫారీ వికెట్ కీపర్ రికెల్టన్ వీరవిహారంతో ఇన్నింగ్స్ సగానికి వచ్చేసరికి ముంబై విజయం దాదాపుగా ఖాయమైంది. 71 బంతుల్లోనే ఈ జోడీ ఏకంగా 148 రన్స్ జోడించిందంటే వారి విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వైభవ్ మూడో ఓవర్లో మిడ్ వికెట్ మీదుగా రోహిత్ సిక్స్ కొట్టగా రికెల్టన్ మరో రెండు సిక్స్‌లు బాదాడు. ప్రపంచకప్‌లో మెరిసిన జింబాబ్వే పేసర్ ముజరబాని ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. వరుణ్ తొలి ఓవర్లోనే రోహిత్.. 4, 6, 4తో 15 రన్స్ రాబట్టాడు. కార్తీక్ త్యాగి ఆరో ఓవర్లో హిట్‌మ్యాన్ తన ట్రేడ్‌మార్క్ సిక్స్‌లతో ఐపీఎల్‌లో 50వ అర్ధ సెంచరీ నమోదుచేశాడు. పవర్ ప్లేలో 80/0తో నిలిచిన ముంబై ఆ తర్వాత రికెల్టన్ సిక్స్‌ల తుఫానుతో 9 ఓవర్లకే 110 రన్స్‌తో పటిష్ట స్థితిలో నిలిచింది. ధాటిగా ఆడే క్రమంలో వైభవ్ బౌలింగ్‌లో 4,6 బాదిన హిట్‌మ్యాన్.. ఐదో బంతికి అనుకుల్ అద్భుత క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. క్రీజులోకి వస్తూనే తనదైన స్కూప్ షాట్‌తో బౌండరీ బాదిన 'ఇంపాక్ట్ ప్లేయర్' సూర్య (16) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. రికెల్టన్ రనౌట్ అయినా విజయానికి 6 పరుగుల దూరంలో తిలక్ వర్మ (20) నిష్క్రమించినా హార్దిక్ పాండ్యా (18*) లాంఛనాన్ని పూర్తిచేశాడు.

ముంబై ఆహ్వానం మేరకు మొదలు బ్యాటింగ్‌కు వచ్చిన కోల్‌కతా పవర్ ప్లేలోనే ధనాధన్ ఆటతో దుమ్మురేపింది. కెప్టెన్ రహానే, న్యూజిలాండ్ విధ్వంసకర ఆటగాడు ఫిన్ అలెన్ (17 బంతుల్లో 37, 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కోల్‌కతాకు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. సిక్స్‌తో రహానే, బౌండరీతో పరుగుల వేటను ఆరంభించిన అలెన్.. అరంగేట్ర బౌలర్ ఘుజన్‌ఫర్, హార్దిక్‌ను లక్ష్యంగా చేసుకుని బాదడంతో 3.5 ఓవర్లకే కేకేఆర్ స్కోరు 50 దాటింది. బుమ్రా బౌలింగ్‌లో రెండు బౌండరీలు బాదిన అలెన్‌ను ఆరో ఓవర్లో శార్దూల్ ఔట్ చేశాడు. అతడి స్థానంలో క్రీజులోకి వచ్చిన కామెరూన్ గ్రీన్ (18) కూడా శార్దూల్ బౌలింగ్‌లోనే రూథర్‌ఫర్డ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో కేకేఆర్ స్కోరు వేగం నెమ్మదించింది. 27 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేసిన రహానే సైతం శార్దూల్ రెండో స్పెల్‌లో పాండ్యాకు క్యాచ్ ఇచ్చాడు. ఈ క్రమంలో వైస్ కెప్టెన్ రింకూ సింగ్ (21 బంతుల్లో 33 నాటౌట్, 4 ఫోర్లు)తో జతకలిసిన రఘువంశీ బ్యాట్‌కు పనిచెప్పాడు. ఘజన్‌ఫర్ ఓవర్లో 4,6 బాదాడు. పాండ్యా 19వ ఓవర్లో బౌండరీతో అతడి ఫిఫ్టీ పూర్తయినా మరుసటి బంతికే పెవిలియన్ చేరాడు. ఆఖరి నాలుగు ఓవర్లలో ముంబై బౌలర్లు కట్టడి చేయడంతో కోల్‌కతా 53 పరుగులు మాత్రమే చేయగల్గింది. 1 ఐపీఎల్‌లో ఒక జట్టుపై అత్యధిక పరుగులు చేసిన వారిలో రోహిత్ (కేకేఆర్‌పై 1,161).. కోహ్లీ (పంజాబ్‌పై 1,159) రికార్డును అధిగమించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

కోల్‌కతా: 20 ఓవర్లకు 220/4 (రహానే 67, రఘువంశీ 51, శార్దూల్ 3/39, పాండ్యా 1/39);
ముంబై: 19.1 ఓవర్లకు 224/4 (రికెల్టన్ 81, రోహిత్ 78, నరైన్ 1/30, త్యాగి 1/43)





## అనుష్క ఫ్లయింగ్ కిస్.. వైరల్ అవుతున్న 'విరుష్క' క్యూట్ మూమెంట్!

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే అటు బ్యాటింగ్‌తోనూ, ఇటు తన రొమాంటిక్ స్టైల్‌తోనూ కింగ్ కోహ్లీ మరోసారి అందరి మనసులను దోచుకున్నాడు. శనివారం జరిగిన హోరాహోరీ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు, కెప్టెన్ ఇషాన్ కిషన్ 80 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు చేసింది. అయితే 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉండటంతో ఆర్‌సీబీ చాలా సులువుగా ఊదేసింది.

కేవలం 15.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఆర్‌సీబీ విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగి కేవలం 38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, అతనికి తోడుగా దేవదత్ పడిక్కల్ కూడా 61 పరుగులతో అద్భుతంగా రాణించాడు.

మ్యాచ్‌లో ఆర్‌సీబీ విజయం ఖరారు కాగానే స్టేడియంలో అందరినీ ఆకట్టుకునేలా ఒక క్యూట్ 'విరుష్క' మూమెంట్ చోటుచేసుకుంది. గెలుపు ఆనందంలో విరాట్ కోహ్లీ తన హెల్మెట్ తీసి, స్టాండ్స్‌లో తన కోసం ఉత్సాహంగా చీర్ చేస్తున్న భార్య అనుష్క శర్మ వైపు చూస్తూ ముద్దుగా 'ఫ్లయింగ్ కిస్' ఇచ్చాడు. దానికి స్పందనగా అనుష్క కూడా ఏమాత్రం ఆలస్యం చేయకుండా అంతే ప్రేమగా కోహ్లీకి రిటర్న్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చింది. ఈ దృశ్యాన్ని అక్కడే మ్యాచ్ చూడటానికి వచ్చిన ఆర్‌సీబీ మహిళల జట్టు క్రికెటర్లు స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ నవ్వుతూ ఆశ్చర్యంగా చూశారు. ఈ అందమైన క్షణంతో చిన్నస్వామి స్టేడియం ఒక్కసారిగా అభిమానుల అరుపులతో హోరెత్తిపోయింది.



## సబలెంకా సన్‌షైన్ డబుల్

### మియామి ఓపెన్ టైటిల్ కైవసం

టాప్ సీడ్ అరీనా సబలెంకా ఖాతాలో మరో ఘనత. ఇటీవలే ఇండియన్ వెల్స్ గెలిచిన ఈ బెలారస్ బామ.. తాజాగా ఆదివారం ముగిసిన మియామి ఓపెన్‌లోనూ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుని 'సన్‌షైన్ డబుల్' సాధించింది. ఫైనల్‌లో సబలెంకా.. 62, 46, 63తో నాలుగో సీడ్ కోకో గాఫ్ (యూఎస్‌ఏ)ను చిత్తుచేసింది. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీల (ఇండియానా వెల్స్, మియామి ఓపెన్)ను ఒకే సీజన్‌లో గెలిచిన ప్లేయర్లకు సన్‌షైన్ డబుల్ గెలిచిన ఆటగాళ్లుగా గుర్తింపు దక్కుతుంది. 2022లో పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్ (మొత్తంగా ఐదో) క్రీడాకారిణీగా రికార్డులకెక్కింది.



# కరివేపాకు హెయిర్ స్ప్రే..
## ఇలా చేస్తే జుట్టు వద్దన్నా పెరుగుతుంది..!

ప్రస్తుతం జుట్టు రాలడం అనే సమస్య అందరినీ వేధిస్తోంది. ఆడ, మగ అని తేడా లేకుండా ఈ సమస్యను అందరూ ఫేస్ చేస్తున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం, ఒత్తిడి ఇలా అనేక కారణాల వల్ల జుట్టు రాలడం, లేదా చిన్న వయసులోనే తెల్ల జుట్టు రావడం సమస్య అనేకమందిని వేధిస్తోంది. అయితే ఈ సమస్యను పరిష్కరించుకోవడం కోసం అనేక రకాల షాంపోలు, ఇతర హెయిర్ ఆయిల్స్ వాడుతుంటారు. అయితే పలు కారణాల వల్ల ఈ సమస్య తగ్గకపోగా అధికమవుతూ వస్తోంది.

అయితే ఇప్పుడు ఈ సమస్యకు వంటింట్లోనే బెస్ట్ చిట్కా ఉందని మీలో చాలా మందికి తెలియదు. మనం రోజూ వాడే పదార్థాలతోనే ఈ జుట్టు రాలుట సమస్యకు బెస్ట్ రెమెడీని తయారు చేసుకోవచ్చు. ప్రతి ఇంట్లో సులభంగా లభ్యం అయ్యే కరివేపాకుతో ఈ సూపర్ మెడిసిన్ ను తయారు చేసుకోవచ్చు. కరివేపాకులో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. కరివేపాకు జుట్టుకు చాలా మేలు చేస్తుంది. కరివేపాకును వాడటం వల్ల జుట్టును నల్లగా, మందంగా మారుతుంది. అంతేకాక జుట్టును ఒత్తుగా చేయడానికి కరివేపాకు ఎంతో సాయపడుతుంది.

కరివేపాకులోని విటమీన్ సీ, ఐరన్, కాల్షియం, యాంటీ ఆక్సిండెంట్స్ అలాగే అమైనో యాసిడ్స్ కారణంగా జుట్టు రాలిపోవడం ఆగడమే కాకుండా.. జుట్టు మళ్లీ మందంగా, బలంగా మారుతుంది. మరి కరివేపాకుతో ఈ హెయిర్ స్ప్రేను ఎలా తయారు చేసుకోవాలి..? కరివేపాకుతో పాటు ఇంకా ఏఏ పదార్థాలు కావాలి..? కరివేపాకు హెయిర్ స్ప్రే తయారీ విధానం ఏంటి..? కరివేపాకు నూనె తయారీకి ఒక గుప్పెడు కరివేపాకు రెమ్మలు, అర కప్పు కొబ్బరి నూనె తీసుకోవాలి. కొబ్బరి నూనెను ఓగిన్నెలో పోసి వేడి చేయాలి. ఆ తర్వాత దానిలో కరివేపాకు వేసుకోవాలి. అలా ఆకులు నల్లగా మారేంతవరకూ ఈ నూనెను తక్కువ మంట మీద ఉడికించుకోవాలి. ఆ తర్వాత గ్యాస్ ఆఫ్ చేసుకుని నూనెను చల్లబరచాలి. ఇప్పుడు ఆ నూనెను వడకట్టుకోవాలి. ఆ స్వచ్ఛమైన కరివేపాకు నూనెను గాలి దూరని ఓ గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఇక ఈ నూనెతో వారానికి 23 సార్లు తలకు మసాజ్ చేసుకోవాలి. అలా ఒక 1 గంటపాటు పెట్టుకుని ఆ తర్వాత కడిగేసుకోవాలి.



# వేసవిలో బీర్ తాగుతున్నారా..


మద్యం ఆరోగ్యానికి హానికరం. అయినా, మద్యం విక్రయాలు ఏ మాత్రం తగ్గటం లేదు. మద్యంలో అనేక రకాల బ్రాండ్లు ఉన్నాయి. యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్ ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్లు ఎక్కువగా తాగడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బీర్లలో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ అతిగా సేవిస్తే మాత్రం అనర్థాలు తప్పవని చెబుతు న్నారు.

బీర్లు అతిగా తాగితే అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ, బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది.

బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘ కాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది.

పరిమితికి మించితే సమస్యలు తప్పవు ఎక్కువగా బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాల ను పొందవచ్చని సూచిస్తున్నారు. మద్యానికి బానిసైన వారికి నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. తొలుత మత్తులో నిద్రపోయినా తర్వాత వారికి నిద్రాభంగం జరుగుతుంది. దీని వల్ల సరైన నిద్ర ఉండదు. మరుసటి రోజు అలసట, మానసిక ఒత్తిడికి గురవుతారు. బీరులో క్యాలరీలు అధికంగా ఉండటం వల్ల త్వరగా బరువు పెరుగుతారని, తద్వారా ఊబకాయం సమస్య బారిన పడతారని చెబుతున్నారు. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ శాతం పెరుతుందని హెచ్చరిస్తున్నారు.



# రోజూ 45 నిమిషాలు వాకింగ్

### జీవితంలో జరిగే అద్భుతమైన మార్పు ఏంటో తెలుసా!

**ఆరోగ్యంగా ఉండాలంటే జిమ్‌కి వెళ్లి గంటల తరబడి చెమటలు చిందించాలనో, కష్టతరమైన వ్యాయామాలు చేయాలనో చాలామంది భావిస్తుంటారు. కానీ, ఆడంబరాలు లేని అతి సాధారణమైన 'నడక' మన జీవితంలో ఎంతటి మార్పు తీసుకువస్తుందో ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్ కోర్ట్నీ నిరూపించారు. కేవలం 45 రోజుల పాటు, రోజుకు 45 నిమిషాల నడక ఆమె శారీరక, మానసిక స్థితిని ఎలా మార్చేసిందో తెలుసుకుందాం..**

మనం ఏదైనా సాధించాలంటే తీవ్రమైన శ్రమ ఉండాలని అనుకుంటాం. కానీ, ఫిట్‌నెస్ విషయంలో తీవ్రత కంటే 'నిలకడ' ఎక్కువ ఫలితాలను ఇస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 'కోర్ట్నీస్ హెల్త్ కార్నర్' నడిపే కోర్ట్నీ, తన 45 రోజుల నడక ప్రయాణాన్ని పంచుకున్నారు. ఇది కేవలం బరువు తగ్గడం గురించి మాత్రమే కాదు, జీవితంపై ఆమె దృక్పథాన్ని మార్చిన ఒక అద్భుత ప్రయాణం.

### క్రమశిక్షణకు పునాది

ప్రతిరోజూ 45 నిమిషాల పాటు నడవాలనే నిశ్చయించుకోవడం కోర్ట్నీలో ఒక తెలియని ఉత్సాహాన్ని నింపింది. తనకు తాను ఇచ్చుకున్న మాటను నిలబెట్టుకోవడం వల్ల ఇతర పనుల్లో కూడా క్రమశిక్షణ పెరిగింది. "రోజువారీ నడక నా జీవితంలోని ఇతర పనులను సులభతరం చేసింది. ఒక మంచి ఎంపిక మరో మంచి నిర్ణయానికి దారితీసింది" అని ఆమె వివరించారు.

ఈ చిన్న అలవాటు ఆమెలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నడక అనేది కోర్ట్నీకి కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది ఒక 'మీటైమ్'. గందరగోళంగా ఉన్న మనసుతో నడక మొదలుపెట్టినా, ముగించే సమయానికి చాలా ప్రశాంతంగా, ఉల్లాసంగా అనిపించేదట. కుటుంబ సభ్యుల సహకారంతో ఎలాంటి అంతరాయం లేని ఈ సమయం ఆమెలోని ఒత్తిడిని తగ్గించి, మానసిక స్పష్టతను ఇచ్చింది.

### పెరిగిన శారీరక సామర్థ్యం..

మొదట్లో ట్రెడ్‌మిల్ మీద కొంచెం వాలు కూడా కష్టంగా అనిపించిన కోర్ట్నీకి, 45 రోజుల నిరంతర సాధనతో 5 నుండి 10 శాతం వాలును కూడా సులభంగా అధిగమించే స్టామినా పెరిగింది. క్రమం తప్పకుండా చేసే చిన్న ప్రయత్నం కూడా కాలక్రమేణా గొప్ప శారీరక శక్తిని ఇస్తుందని ఆమె నిరూపించారు. ఒక ఉపాధ్యాయురాలిగా ఉన్న కోర్ట్నీకి, నడక సమయంలో కొత్త ఆలోచనలు రావడం మొదలైంది.

స్క్రీన్లకు, బాధ్యతలకు దూరంగా నడుస్తున్నప్పుడు ఆమె మెదడు స్వేచ్ఛగా ఆలోచించి, పాఠ్యాంశాల ప్రణాళికలు, సమస్యల పరిష్కార మార్గాలను కనుగొనేది. నడక అనేది మెదడుకు విరామ సమయంలా పనిచేసి, సృజనాత్మకతను పెంచిందని ఆమె పేర్కొన్నారు.

పెద్ద పెద్ద మార్పుల కంటే స్థిరంగా చేసే చిన్న పనులే జీవితాన్ని మారుస్తాయి. ఖరీదైన జిమ్ మెంబర్‌షిప్‌లు, కష్టమైన డైట్‌లు లేకుండానే కేవలం 'నడక'తో కోర్ట్నీ తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకున్నారు. మీరు కూడా మీ జీవితంలో మార్పు కోరుకుంటున్నారా? అయితే, ఈరోజే ఒక చిన్న అడుగు వేయండి!





## మొన్నటిదాక తోపు సింగర్..

జోనితా గాంధీ. ఇప్పటివరకు తెలుగు చిత్ర పరిశ్రమలో తన మధురమైన గొంతుతో, దక్షిణాది, ఉత్తరాదిలో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. ముఖ్యంగా 'అరబిక్ కుత్తు' (పుష్ప), 'మల్లీశ్వరి' వంటి సూపర్ హిట్ పాటలతో ఆమె పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది. అయితే, కేవలం గాయనిగానే కాకుండా, ఇప్పుడు ఆమె తనలోని డ్యాన్సింగ్ టాలెంట్‌ను కూడా చూపించబోతోంది. 'డెకాయిట్' సినిమాలో రాబోయే ఈ మాస్ సాంగ్‌లో జోనితా స్టెప్పులు వేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాను షానెల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఒక రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. అడివి శేష్ ఈ సినిమాలో చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుండగా, శృతి హాసన్ ఆయనకు జోడీగా నటిస్తోంది. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీలో కూడా ఒకేసారి చిత్రీకరిస్తున్నారు. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. సాధారణంగా సినిమాల్లో స్టార్ హీరోయిన్లు లేదా స్పెషల్ సాంగ్ ఆర్టిస్టులు ప్రత్యేక గీతాల్లో నటిస్తుంటారు. కానీ, ఒక పాపులర్ సింగర్ ఇలాంటి సాంగ్‌లో నటించడం విశేషం. ఈ పాట సినిమా కథా గమనంలో చాలా కీలకంగా ఉంటుందని, జోనితా గ్లామర్, డ్యాన్స్ ఈ సాంగ్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది.



## అదిదా సర్ ప్రైజ్..

### ఆ హీరోయిన్ సినిమాలో ప్రభాస్ స్పెషల్ రోల్


తెలుగు సినిమా ప్రపంచంలో విభిన్న కథలతో వరుస విజయాలను అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. హనుమాన్ సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న ఆయన.. ఇప్పుడు సినిమాటిక్ యూనివర్స్ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. తేజ సజ్జా నటించిన హను మాన్ మూవీతో ప్రారంభమైన ఈ యూనివర్స్.. ఇప్పుడు సరికొత్త చిత్రాలతో పాన్ ఇండియా సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ క్రమంలోనే కన్నడ హీరో రిషబ్ సెట్టితో జై హనుమాన్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇదివరకు విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఈ సినిమా పై అంచనాలు పెరిగాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ పై మరోసారి హైప్ క్రియేట్ అయ్యింది. అందుకు కారణం యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లోకి ప్రభాస్ అడుగు పెట్టనున్నట్లు ప్రచారం జరుగుతుంది. సినీరంగంలో వినిపిస్తున్న టాక్ ప్రకారం.. ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న మహాకాళి సినిమాలో ప్రభాస్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు టాక్.ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన షూటింగ్ ను డార్లింగ్ పూర్తి చేశారని టాక్. దీంతో ఆయన కనిపించబోయే పాత్ర ఏంటోనని అభిమానులు ఆరా తీస్తున్నారు. మహాకాళి సినిమా ఇప్పటివరకు దాదాపు 100 రోజుల షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. ఇందులో ధురంధర్ నటుడు అక్షయ్ ఖన్నా సైతం కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. పూజా అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మహిళా సూపర్ హీరో చిత్రంలో భూమి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ రచన చేయగా, ఆర్‌కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మించారు. స్మరణ్ సాయి సంగీతం అందించారు.

## పాట కోసం భాగ్యనగరంలో భారీ సెట్



తన గత చిత్రాలకు భిన్నంగా శరవేగంగా 'వారణాసి' చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 60శాతం పూర్తయింది. వచ్చే నెల తొలివారం నుంచి ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలు కానుంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాలపై ఓ పాటను ప్లాన్ చేశారు రాజమౌళి. ఈ పాట కోసం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఓ భారీ సెట్‌ని నిర్మిస్తున్నారు. ఈ సాంగ్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయని వినికిడి. భారతీయ పురాణ, ఇతిహాసాల నేపథ్యంలో సాగే ఈ సినిమా కథలో, అడ్వెంచర్లకు కొదవ ఉండదని, ట్రెజర్ హంట్ కూడా ఈ కథలో కీలకమైన భాగమని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాలోని కొంతభాగం మహేశ్ శ్రీరామచంద్రుడిగా కనిపించనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన షూటింగ్‌ని కూడా రాజమౌళి పూర్తి చేశారు. 1300కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పాన్‌వరల్డ్ గ్లోబల్ అడ్వెంచర్‌ని రెండు భాగాలుగా విడుదల చేయాలనే ఆలోచనలో కూడా మేకర్స్ ఉన్నట్టు తెలిసింది. 2027 ఏప్రిల్ 7న విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రతినాయకునిగా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కథ: వి.విజయేంద్రప్రసాద్, మాటలు: దేవకట్టా, కెమెరా: పీఎస్ వినోద్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: కె.ఎల్.నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ, నిర్మాణం: శ్రీదుర్గా ఆర్ట్స్.

## నోట్ల రద్దు ఇబ్బందులు మర్చిపోయారా?



శ్రీలంక అంతర్యుద్ధం ఆధారంగా రూపొందిన చిత్రం 'నీలిర'. ఈ సినిమా ట్రైలర్ రిలీజే ఈవెంట్ కు ప్రముఖ తమిళ దర్శకుడు వెట్రిమారన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన చిత్ర పరిశ్రమలో విద్వేషపూరిత చిత్రాలు పెరుగుతున్నాయంటూ అసంతృప్తి వ్యక్తం చేశాయి. వెట్రిమారన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీశాయి . ఆయన నేరు గా ప్రస్తావించకపోయినా ఆదిత్య ధర్, రణవీర్ సింగ్‌ల చిత్రం 'ధురందర్ 2'ను లక్ష్యంగా చేసుకునే ఈ కామెంట్స్ చేశారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు . 'మనం మన కథలను చెప్పుకునేంత వరకు, మన శత్రువులు చెప్పిందే మన జీవితం. మన సొంత కథలను చెప్పుకోవడానికి మనకు ప్రజాస్వామ్యం లేదు. ఈ చిత్రం ద్వేషాన్ని ప్రోత్సహించదు. హింసను సమర్థించదు. రూ. వందల కోట్లు సంపాదించాలనే ఆశతో కొంతమంది హింసను ప్రేరేపించేలా సినిమాలను నిర్మిస్తున్నారు. కానీ ఈ చిత్రం (నీలిర) ఒక జాతిని, ఒక మతాన్ని కానీ అపహాస్యం చేసేలా తెరకెక్కలేదు'. ఈ రోజుల్లో ప్రతీది ఒక ప్రచారంగా మారిపోయింది. మన జ్ఞాపకాలను, ఆలోచనలను ప్రభావితం చేసే శక్తి ఈ ప్రచారానికి ఉంది. నోట్ల రద్దు వల్ల ఎవరు నష్టపోయారో, క్యూ లైన్లలో నిలబడి ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో మనందరికీ తెలుసు. కానీ ఇప్పుడు వాటన్నింటినీ మరుగున పడేసి, ద్వేషాన్ని పెంచేలా ప్రచారం చేస్తున్నారు. అది సినిమానే కాదు. చరిత్రను లేదా వాస్తవాలను వక్రీకరించి చూపడం 'హేట్ ప్రొపగండా'కిందకే వస్తుంది' అని వెట్రిమారన్ చెప్పుకొచ్చారు.

కాగా 'ధురందర్ 2' సినిమా ఉగ్రవాదాన్ని నివారించడానికి, నకిలీ నోట్ల వ్యాప్తిని అరికట్టడానికి ఒక మార్గంగా నోట్ల రద్దును చూపించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలా మంది దీనిని సమర్థిస్తుంటే మరికొందరు తప్పు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధురందర్ 2 సినిమా గురించి వెట్రిమారన్ మాట్లాడారని తెలుస్తోంది. ఇక 'నీలిర' సినిమా గురించి మాట్లాడిన వెట్రి మారన్.. ' ఎన్నో కష్టాలు ఉన్నప్పటికీ శ్రీలంక అంతర్యుద్ధం కథను ఎంచుకున్న 'నీలిర' బృందాన్ని ఆయన ప్రశంసించారు. తెలుగు రాష్ట్రానికి చెందినవారైనప్పటికీ, ఇంతటి కథకు అండగా నిలిచిన నటుడు రానా దగ్గుబాటి మద్దతును కూడా ఆయన బహిరంగంగా కొనియాడారు.



## చాలా హాట్‌గా, బోల్డ్‌గా.. కాక్‌టెయిల్ 2పై కృతిసనన్ కామెంట్స్ వైరల్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కృతి సనన్. మహేశ్ బాబు, నాగచైతన్య వంటి లీడింగ్ హీరోలతో నటించిన ఈ బ్యూటీ ప్రస్తుతం హిందీ సినిమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. కృతి సనన్ ప్రస్తుతం కాక్‌టెయిల్ 2 సినిమాలో ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న గ్రాండ్‌గా విడుదల కానుంది. మోడ్రన్ లవ్, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో తన పాత్ర తన కెరీర్‌లో ఇప్పటివరకు పోషించని విధంగా చాలా హాటెస్ట్ అండ్ బోల్డ్‌గా సాగుతుందని చెబుతోంది కృతిసనన్. అంతేకాదు తన రోల్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడం ఖాయమంటోంది. ఈ మూవీలో రష్మిక మందన్నా, షాహిద్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో రష్మిక మందన్నా, కృతిసనన్ పార్ట్‌నర్స్‌గా కనిపించబోతుండగా.. ఈ కాంబో కథనాన్ని ఆసక్తికరంగా సాగేలా చేస్తుందట. తాజా టాక్ ప్రకారం ఈ ఇద్దరు ఫీమేల్ స్టార్ల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా బోల్డ్‌గా ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై మరో ప్రయోగాత్మక సినిమాతో ప్రేక్షకులను థ్రిల్ అందించడం పక్కా అయిపోయినట్టే. హోమి అదంజనియా డైరెక్ట్ చేస్తున్న కాక్‌టెయిల్ 2 థీమ్, ప్రజెంటేషన్ చాలా బోల్డ్‌గా ఉండబోతుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. డేరింగ్ స్టోరీ లైన్, స్టన్నింగ్ కాంబోలో వస్తున్న రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**